
ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

ఆదివారం 9 నవంబరు 2025



మ్యాస్ట్రో మ్యూజిక్ మ్యాజిక్

బెజవాడలో ఉర్రూతలూగించిన కన్సార్ట్



భయంభయంగా విధులు

- శిథిలావస్థలో బందరులోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల భవనాలు
- ఊడుతున్న శ్లాబ్ పెచ్చులు.. ఆందోళనలో ఉద్యోగులు

మచిలీపట్నంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉద్యోగులు నిత్యం భయాందోళన మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కొత్త భవనాల నిర్మాణంపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

8



విజయవాడ నగరంలో మ్యాస్ట్రో ఇళయరాజా మ్యూజిక్ కన్సార్ట్ ఉర్రూతలూగించింది. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం వేదికగా శనివారం రాత్రి సంగీత కచేరీ జరిగింది. అమ్మవారిని కీర్తిస్తూ ఇళయరాజా కచేరీని మొదలుపెట్టారు. దాదాపు 3.30 గంటల పాటు ఈ కార్యక్రమం జరిగింది. ప్రముఖ గాయకులు ఎస్పీ చరణ్, హరిచరణ్, శ్యామ్, మధు బాలకృష్ణ, ప్రియా హిమేష్, జితిన్‌రాజ్, సుర్ముఖి, సారథ్ సంతోష్, అనిత, మనో, సునీత, కార్తీక్, విభావరి ఆప్టే, ఉషా ఉతుప్, శ్వేతమోహన్, యుగేంద్రన్ వాసుదేవన్, రీటా త్యాగరాజన్ పాల్గొన్నారు. సంగీత ప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని మ్యాస్ట్రో మ్యూజిక్‌ను ఆస్వాదించారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



మచిలీపట్నం సర్వజనాసుపత్రి

ఆసుపత్రిలో ఆ ఇద్దరు

మచిలీపట్నం సర్వజనాసుపత్రిలో ఇద్దరు ఉద్యోగుల పెత్తనం తారస్థాయికి చేరింది. ఆసుపత్రిలోని కార్యాలయంలో పనిచేసే ఈ ఇద్దరూ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి ఉద్యోగులు, కాంట్రాక్టర్ల నుంచి.. ముడుపులు దండుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. అమరావతిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయం నుంచి మచిలీపట్నం సర్వజనాసుపత్రికి బదిలీపై వచ్చిన ఈ ఇద్దరి అవినీతిపై ఇప్పుడు చర్చ తీవ్రంగా నడుస్తోంది.

మచిలీపట్నం సర్వజనాసుపత్రిలో పెత్తనం

మందులు, ఇతరత్రా సామాగ్రి కొనుగోలులో చేతివాటం

సెలవులు మంజూరు చేయాలంటే ముడుపులు ఇవ్వాల్సిందే

- రీజాయినింగ్ చేసుకోవాలన్నా నగదు ముట్టజెప్పాల్సిందే..
- కీలక పోస్టుల్లోనూ అనుయాయులకే అవకాశం
- ఆ ఇద్దరిపై ప్రజాప్రతినిధులకు భారీగా ఫిర్యాదులు
- అవినీతి పెరిగిపోతున్నా పట్టించుకోని అధికారులు

దాతలు ఇచ్చిన ఏసీలు వేరొకచోటకు..

ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్, ఐసీయూ విభాగాల్లో రోగులకు ఉపయోగపడటం కోసం దాతలు ఇటీవల కాలంలో 12కుపైగా ఏసీలను విరాళంగా ఇచ్చారు. వీటిని ఐసీయూతో పాటు అత్యవసర వైద్యసేవలకు సంబంధించిన విభాగాలకు చెందిన వార్డుల్లో బిగించాల్సి ఉంది. కానీ, అవసరమైన వార్డుల్లో కాకుండా ఆసుపత్రిలోని కార్యాలయ గదుల్లో వీటిని బిగించారని ఉద్యోగులు చెబుతున్నారు. ఈ విషయంలో ఆ ఇద్దరు అధికారులు కీలకంగా వ్యవహరించారని అంటున్నారు. ఐసీయూ, ఇతర అత్యవసర విభాగాల్లో తగినన్ని ఏసీలు లేక ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులు సతమతమవుతున్నారని, రోగులు ఇబ్బందులు పడుతున్న విషయం అధికారులకు కళ్లెదుటే కనిపిస్తున్నా వారు పట్టించుకోవట్లేదని పేర్కొంటున్నారు.

ఓ అధికారికి ఆసుపత్రిలోనే ప్రత్యేక భోజనం

ఓ అధికారి ఆసుపత్రిలోని కేటరింగ్ కాంట్రాక్టర్‌ను తన చెప్పుచేతల్లో పెట్టుకుని తనదైనశైలిలో వ్యవహరిస్తున్నాడు. మధ్యాహ్నం, రాత్రి సమయంలో భోజనం కూడా ఇక్కడే తయారు చేయించుకుని ఇంటికి కూడా తీసుకెళ్తున్నాడని, ఇలాంటి అధికారిని తామెప్పుడూ చూడలేదని ఉద్యోగులు చెబుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఇటీవల అమరావతిలోని వైద్యశాఖ ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన ఇద్దరు ఉద్యోగులు మచిలీపట్నంలోని సర్వజనాసుపత్రిలో అన్నీ తామై నడిపిస్తున్నారు. వైద్యశాఖ ప్రధాన కార్యాలయంలో కొనసాగినట్లుగానే సర్వజన ఆసుపత్రిలోనూ ముడుపులు తీసుకునేందుకు వెనుకాడటం లేదని ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. తమకు తెలియకుండా ఒక్క ఫైల్ కూడా కదలకూడదని ఆంక్షలు పెట్టి మరీ హవా సాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆసుపత్రికి సంబంధించి వైద్యపరికరాలు, మందులు, ఇతర వస్తువుల కొనుగోళ్లకు సంబంధించి బిల్లులు చేయాలంటే తమకు ఇంతమేర కమీషన్ ఇవ్వాలని వీరు పట్టుబడుతున్నారని సమాచారం. తమకు అనుకూలమైన ఉద్యోగులను కీలక పోస్టుల్లో కూర్చోబెట్టడం, ఇష్టంలేని వారికి ప్రాధాన్యతలేని పోస్టులు కేటాయించడంలో ఈ ఇద్దరు ఉద్యోగులు తెరవెనుక తమదైనశైలిలో చక్రం తిప్పుతున్నారు. పంతానికి పోయి ఇటీవల ఓ ఉద్యోగికి కేటాయించాల్సిన సీటును వేరొకరికి కేటాయించడంతో

మిగతా 6లో..

అందరికీ అందుబాటులో అమ్మ ప్రసాదం

గ్రామ సచివాలయాల్లో బుకింగ్‌కు నిర్ణయం

- భవానీ దీక్షల విరమణ ఉత్సవాల నేపథ్యంలోనే..
- యాప్‌లోనూ బుక్ చేసుకునే అవకాశం
- కొరత లేకుండా చేయడానికి ప్రణాళిక
- దుర్గగుడి అధికారులతో పోలీసు కమిషనర్ సమీక్ష



దుర్గగుడి అధికారులు, పోలీసులతో సీపీ సమీక్ష సమావేశం

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ లడ్డూ ప్రసాదాన్ని ఇకపై గ్రామ సచివాలయాల్లో బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించాలని అధికారులు నిర్ణయించారు. భవానీ దీక్షల విరమణ ఉత్సవాల్లో ఈ ప్రణాళికను అమలు చేయాలని భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : డిసెంబరు 11 నుంచి 15 వరకు ఐదు రోజుల పాటు ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్షల విరమణ జరుగుతుంది. దీనిపై నగరంలోని పోలీసు కమిషనర్ చాంబర్‌లో శనివారం పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు.. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఈవో శీనానాయక్, ఈఈ కోటేశ్వరరావు, పశ్చిమ డివిజన్ ఏసీపీ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. దసరా ఉత్సవాల మాదిరిగా భవానీ దీక్షలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు మొత్తం 19 లక్షల మంది భక్తులు వచ్చారు. తొలిరోజు నుంచి భక్తులు అడిగినన్ని లడ్డూలు అందజేసిన దేవస్థాన సిబ్బంది చివరి మూడు రోజుల్లో చేతులెత్తేశారు. భక్తులు ఐదు లడ్డూలు అడిగితే రెండే

మిగతా 6లో..

సచివాలయాల్లో ఇలా..

రాష్ట్రంలో 15,004 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వాటిద్వారా లడ్డూలను ముందే బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని అధికారులు నిర్ణయించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి బయల్దేరే భవానీలు సమీపంలో ఉండే గ్రామ సచివాలయాలకు వెళ్లి ఏ తేదీన అమ్మవారి దర్శనం చేసుకుంటారో, ఎన్ని లడ్డూలు కావాలో తెలియజేయాలి. దీనికి సంబంధించిన డబ్బును ఆన్‌లైన్‌లో అక్కడే చెల్లించాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఒక టోకెన్ ఇస్తారు. దాన్ని తీసుకొచ్చి దర్శనం పూర్తయ్యాక లడ్డూ కౌంటర్‌లో చూపిస్తే బుక్ చేసుకున్నన్ని లడ్డూలు ఇస్తారు.

వాట్సాప్ వేదికగా మరో నయా మోసం వెల్లువెత్తుతోంది. ఓ ట్రస్టు పేరిట వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయడమే కాకుండా.. అందులో చాలామందిని యాడ్ చేసి, అదిరిపోయే ఆఫర్లంటూ డబ్బు పిండే ప్రయత్నం చేస్తున్నారు. విజయవాడతో పాటు జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ఈ ఆన్‌లైన్ మోసం ఇప్పుడు కలవరపెడుతోంది.

వాట్సాప్ మోసం

గ్రూపులు క్రియేట్ చేసి ట్రస్ట్ పేరిట ఆఫర్లు

- రూ.2 వేలు కడితే.. రూ.18,500 ఇస్తామని మెసేజ్‌లు
- జిల్లాలోని వివిధ వర్గాలు టార్గెట్‌గా గ్రూపులో యాడింగ్
- పంథా మారుస్తున్న సైబర్ నేరగాళ్లు
- తక్కువ మొత్తాలే టార్గెట్‌గా నయా మోసాలు
- పోలీసులు సుమోటాగా స్వీకరించాలనే డిమాండ్

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం) : ఓ ట్రస్ట్ పేరిట వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసి, ఆఫర్ పేరుచెప్పి 'రూ.2 వేలు కట్టండి.. రూ.18,500 మీ ఖాతాలో జమ చేస్తాం..' అంటూ కేటుగాళ్లు అమాయకులకు ఎర వేస్తున్నారు. విజయవాడతో పాటు జిల్లావ్యాప్తంగా మహిళలు, అధికారులు, జర్నలిస్టులు, డాక్టర్లు, పోలీసులు, విద్యార్థులు ఇలా వివిధ వర్గాలను లక్ష్యంగా చేసుకుని వారికి తెలియకుండానే వాట్సాప్ గ్రూపులో యాడ్ చేస్తున్నారు. గ్రూప్ అడ్మిన్లుగా ఇమోతి, లవ్ అనే పేర్లతో పాటు మరో వ్యక్తి ఉంటున్నారు. మిగతా సభ్యులు చాటింగ్ చేయకుండా లాక్

మిగతా 6లో..



రూ.2 వేలు కడితే.. రూ.18,500 వేస్తామంటూ వాట్సాప్ గ్రూపులో మెసేజ్

పశ్చిమ బైపాస్.. మరో 6 నెలలు



ప్యాకేజీ-4లో జరుగుతున్న పనులు

మార్చి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం



ప్యాకేజీ-3లో అంబాపురం వద్ద మిగిలిన పనులు

- ఎన్‌హెచ్-16కు అనుసంధాన పనులు కీలకం
- చిన్న అవుటపల్లి దగ్గర ఇంకా ప్రారంభం కాలేదు
- కాజ దగ్గర ఇప్పుడిప్పుడే మొదలు
- ప్యాకేజీ-3, 4లో అక్కడక్కడ మిగిలిన పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పశ్చిమ బైపాస్ పనులు పూర్తి కావటానికి మరో 6 నెలలు పట్టే అవకాశం కనిపిస్తోంది. మార్చి నాటికి సంపూర్ణంగా అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి. ప్యాకేజీ-3, 4 పనులకు సంబంధించి 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3 పనులు 96 శాతం, గొల్లపూడి, సూరాయపాలెం, కృష్ణానది మీదుగా కాజ వరకు ప్యాకేజీ-4 పనులు 88 శాతం పూర్తయ్యాయి. మిగతా పనులు పూర్తి కావటానికి గరిష్ఠంగా 6 నెలల సమయం పట్టే అవకాశం కనిపించింది. కాజ-విజయవాడ-గుండుగొలను రోడ్డు ప్రాజెక్టును నాలుగు ప్యాకేజీలుగా చేపట్టారు. ఇందులో ప్యాకేజీ-1, 2 పనులు ఇప్పటికే అందుబాటులోకి రాగా, ప్యాకేజీ-3, 4 పనులు ఇంకా పూర్తి కాలేదు. ఈ పనులు తుదిదశకు చేరుకున్నప్పటికీ కొన్ని పనులు మిగిలే ఉన్నాయి.

ప్యాకేజీ-3లో మిగిలినవి

ప్యాకేజీ-3 పనుల్లో పశ్చిమ బైపాస్ మొదలయ్యే చిన్న అవుటపల్లి దగ్గర ఎన్‌హెచ్-16 అనుసంధాన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఇవి కాలాతీతమైనవి. ట్రాఫిక్‌ను మళ్లించి జాతీయ రహదారికి అనుసంధానించాలి. ఈ పనులు చివర్లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సూరంపల్లి దగ్గర ఆర్వోబీపై క్రాష్ బ్యారియర్స్ పనులు జరుగుతున్నాయి. ఇవి

మిగతా 6లో..

బోర్డును తొలగించకుండా అడ్డుకుంటున్న ఆలయ కమిటీ చైర్మన్ సతీష్



ఆలయ స్థలంలో ఉద్రిక్తత

కోర్టు ఉత్తర్వుల బోర్డు పెట్టిన అధికారులు

- బలవంతంగా తొలగించిన ఆక్రమణదారులు

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానానికి చెందిన స్థలం వద్ద శనివారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. 'ఆలయ స్థలం ఆక్రమణ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో కోర్టు ఉత్తర్వులతో కూడిన బోర్డును ఆ స్థలంలో ఏర్పాటు చేసేందుకు దేవదాయ శాఖ అధికారులు ప్రయత్నించారు. ఈవో గోపాలరావు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్, సభ్యులు ఆ బోర్డును ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న ఆక్రమణదారు గ్రంధి లక్ష్మి, ఆమె కుమారుడు కిరణ్, మరికొందరు ఆ ప్రాంతానికి

మిగతా 6లో..

కానూరు ప్రయాణం నరకం

- రోడ్డు అసాంతం గోతులమయం

6

దుర్గగుడి ఉద్యోగులకు షోకాజ్

- అభివృద్ధి పనులు, విధుల్లో నిర్లక్ష్యమే కారణం

6

స్వచ్ఛ చల్లపల్లి పాఠ్యాంశం కావాలి

- 11వ వార్షికోత్సవంలో డాక్టర్ ఏపీ గురవారెడ్డి



సి.డి.వి.సుబ్బారావు దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, ఆహ్వానితుడు రామబ్రహ్మం

దుర్గగుడి అభివృద్ధికి ప్రకాష్ ఆర్ట్స్ అధినేత రూ.10 లక్షల విరాళం

ఇంద్రకీలాద్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనుల నిమిత్తం గవర్నరుపేటలోని ప్రకాష్ ఆర్ట్స్ అధినేత సి.డి.వి.సుబ్బారావు, పుష్పలత దంపతులు రూ.10 లక్షలు విరాళంగా శనివారం దేవస్థానం కమిటీ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వి.కె.శీనానాయక్‌లకు అందజేశారు. ఆలయ అధికారులు వారికి, కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి పంచహారతుల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. చైర్మన్, ఈవో, పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితుడు ఎం.రామబ్రహ్మం వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. ఎం.రామబ్రహ్మం సూచనల మేరకు దాత సుబ్బారావు దుర్గగుడి అభివృద్ధికి రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. చైర్మన్, ఈవోలు దాత దంపతులు, కుటుంబ సభ్యులు వెంకట సత్యప్రకాష్, మణిలక్ష్మీ రిషిత, రామమణిలను అభినందించారు.



ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి మాట్లాడుతున్న సినీ నిర్మాత చలసాని అశ్వనీదత్, పక్కన నెట్టెం రఘురామ్, బుద్దా వెంకన్న

ఎంపీ శివనాథ్‌తో నిర్మాత అశ్వనీదత్ భేటీ

వన్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వైజయంతీ మూవీస్ అధినేత, ప్రముఖ నిర్మాత చలసాని అశ్వనీదత్ శనివారం ఎంపీ కేశినేని శివనాథ్‌తో భేటీ అయ్యారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్‌కి విచ్చేసిన ఆయనకు ఎంపీ శివనాథ్ సాదర స్వాగతం పలికారు. ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్నలను కూడా అశ్వనీదత్ కలిశారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీ చేస్తున్న కృషిని అశ్వనీదత్ అభినందించారు. ఏసీఏ అధ్యక్షుడిగా రాష్ట్రంలో క్రికెట్ రంగం అభివృద్ధి కోసం శివనాథ్ ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం వీరంతా రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను చర్చించారు.



శుక్రవారం అర్ధరాత్రి వాహనాలను ఆపి డ్రైవర్లతో ముఖం కడిగించి జాగ్రత్తలు చెబుతున్న పోలీసు ఉన్నతాధికారులు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

విద్యాధరపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాత్రి వేళ రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కమిషనరేట్ పరిధిలోని ముఖ్య రహదారుల్లో ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసు అధికారు ఆగు..ముఖం కడుక్కో...విశ్రాంతి తీసుకో..బయలుదేరు నినాదంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఎక్కువ దూర ప్రయాణంలో తెల్లవారుజామున 2గంటల నుంచి 5 గంటల ప్రాంతంలో డ్రైవర్లు నిద్రలోకి జారుకోవటం వలన ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. శుక్రవారం రాత్రి భవానీపురం, గొల్లపూడి హైవే సమీపంలో, తిరువూరు హైవే సమీపంలో, జి.కొండూరు, సత్యనారాయణపురం, మాచవరం, ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లలో ఈ కార్యక్రమాన్ని చేపట్టి వాహనదారులను ఆపి తనిఖీలు నిర్వహించారు. డ్రైవర్లకు ముఖం కడుక్కోమని వాటర్ ఇచ్చి వారితో ముఖం కడిగించి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోమని చెప్పి పంపించారు. ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పశ్చిమ బైపాస్..మరో 6 నెలలు

(5వ పేజీ తరువాయి)

పక్షం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. నున్న వద్ద ట్రాన్స్‌కో విద్యుత్ లైన్లు డౌన్‌లో ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో 350 మీటర్ల మేర రోడ్డు పోర్షన్ పనులు మిగిలి ఉన్నాయి. ట్రాన్స్‌కో టవర్ల ఎత్తు పెంచితే ఈ పనులు చేపట్టే అవకాశం ఉంటుంది. కేంద్రం నుంచి అనుమతులు వస్తే.. దీనికి సంబంధించి రైతులు హైకోర్టులో వేసిన మూడు కేసులు వీగిపోతాయి కాబట్టి ఆ తర్వాత పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంటుంది. అంబాపురం దగ్గర ఆర్వోబీ శ్లాబ్ పోర్షన్ పనులు చేపట్టలేదు. ల్యాంకో హైటెన్షన్ విద్యుత్ లైన్ల కారణంగా ఈ పని జరగలేదు. ఇటీవల టవర్ల పొడిగింపునకు ఎన్‌హెచ్ అవకాశం ఇచ్చింది. హైకోర్టులో కూడా రైతులు వేసిన కేసులకు పరిష్కారం లభించింది. ఇక్కడ శ్లాబ్ పోర్షన్ పనులు చేపడితే సరిపోతుంది. ఇవి తప్ప మిగిలినచోట్ల ఆరు వరసల పనులు పూర్తయ్యాయి. ఆర్వోబీలు కూడా పూర్తయ్యాయి. ప్యాకేజీ-3లో పనులన్నీ పూర్తి కావటానికి 4 నెలలు పడుతుంది.

ప్యాకేజీ-4లో పరిస్థితి ఇదీ..

గొల్లపూడి ఆర్వోబీ దిగిన దగ్గర నుంచి సూరాయపాలెం వరకు రోడ్డు పోర్షన్ పనులు, కృష్ణానదిపై 3 కిలోమీటర్ల వంతెనల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వెంకటాయపాలెం టోల్‌గేట్ దాటాక మధ్యలో రెండు, మూడుచోట్ల కొంతమేర రోడ్డు స్ట్రెచ్ పనులు మిగిలి ఉన్నాయి. యాష్ డంపింగ్, ఎర్త్ వర్క్, రోడ్డు ఫార్మింగ్ పనులు జరుగుతున్నాయి. రైల్వే ఫ్లై ఓవర్‌కు ముందు ఉండే ఆర్వోబీ పనులు సగమే పూర్తయ్యాయి. మరో సగం పనులు పూర్తి కాలేదు. ఈ మధ్యలో చిన్నచిన్న గ్యాపులు ఉన్నాయి. ఎన్ఆర్ఐ హాస్పిటల్‌కు ముందు భాగంగా సర్వీసు రోడ్ల పనులు అసంపూర్ణంగా ఉన్నాయి. అన్నింటికంటే అతి ముఖ్యమైన కాజ ల్యాండింగ్ పోర్షన్ పనులు ప్రారంభమైనా ఇంకా పూర్తికాలేదు. ఈ ప్రాంతంలో పలు నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. రోడ్డు పోర్షన్ పనులు మిగిలి ఉన్నాయి. పశ్చిమ బైపాస్‌లో ప్యాకేజీ-4 పనులు పూర్తి కావటానికి ఐదారు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

ఆలయ స్థలంలో ఉద్రిక్తత

(5వ పేజీ తరువాయి)

చేరుకుని బోర్డును తొలగించే ప్రయత్నం చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. చైర్మన్ సతీష్‌ను తోసేసి బోర్డును తొలగించారు. సమాచారం తెలియజేసినా టూటౌన్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయలేదని దేవదాయ శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సర్వేయర్‌తో సర్వే చేయించి దేవస్థానానికి చెందిన స్థలంలో బోర్డును ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.



ఆర్పీ వద్ద రహదారి ఇలా..





డీర్లోకి వెళ్లే రోడ్డులో గోతులు

కానూరు ప్రయాణం నరకం

- రోడ్డు గోతులమయం
- రోడ్డు పక్కన మురుగు
- తరచూ ట్రాఫిక్ జామ్
- నత్తనడకన రోడ్డు పనులు

కానూరు ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఎడ్యుకేషన్ హబ్‌గా ప్రసిద్ధి. అయితే, కానూరు వెళ్లే రోడ్డు ప్రజలకు నరకం చూపిస్తోంది. జాతీయ రహదారి ఆర్పీ నుంచి రహదారి పొడవునా అన్నీ గోతులే. పక్కన బురద గుంటలు. వాహనాలు వెళ్తుంటే కంకర, దుమ్ము లేచి పాదచారులను గాయాల పాల్జేస్తోంది. కామయ్య తోపు నుంచి కానూరు వెళ్లే వరకు ఇదే దుస్థితి. వాహనాలు కనీసం కదలలేని పరిస్థితి. తోడు ఏడాదిన్నరగా రోడ్డు, డ్రైనేజీ నిర్మాణపనులు కొనసాగుతూనే ఉండడం, నిర్మాణపనులకు సంబంధించిన మెటీరియల్ రోడ్డుపైనే ఉండడంతో కుచించుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

విజయవాడలోని ప్రధాన ప్రాంతాలైన పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్, బందరురోడ్డు (కలెక్టరేట్, ఈట్ స్ట్రీట్), బెంజిసర్కిల్, ఆటోనగర్ నుంచి కానూరు వెళ్లడానికి బందరు రోడ్డు కామయ్యతోపు మీదుగానే వెళ్లాలి. కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఈ ప్రాంతంలో అధికంగా ఉండడం తో ఎడ్యుకేషన్‌గా హబ్‌గా పేరుంది. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో రోడ్డు ఖాళీ లేకుండా అరగంటకు పైగా ట్రాఫిక్ స్తంభించిపోయే పరిస్థితి. సిటీ నుంచి బస్సులు, ఇతర హెవీ వెహికల్స్‌కు ఈ రోడ్డే దిక్కు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డులో ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోగులను ఈ రోడ్డు గుండా ఆసుపత్రికి తీసుకురావాలంటే పైప్రాణాలు పైనే పోయేలా ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. ఒక్కోసారి భారీ వాహనాలు పెద్దపెద్ద గుంతల్లో ఇరుక్కుపోయి కదలకపోవడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం, మధ్యలో డివైడర్ లేకపోవడంతో ఇరువైపుల వచ్చిపోయే వాహనాల్లో ఏ ఒక్క వాహనం ఆగిపోయినా కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోతోంది. రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించినప్పటికీ ఎక్కడివేసిన గొంగళి అక్కడే అన్న చందాన ఉంది. వేసవి కాలంలో ఇళ్లు, షాపుల్లోకి విపరీతమైన దూళి వస్తోందని స్థానిక ప్రజలు, షాపుల యజమానులు వాపోతున్నారు.



వర్షం కురిస్తే రోడ్డు మీద మురుగు

వర్షాకాలంలో పరిస్థితి మరీ ఘోరం

వర్షాకాలంలో ఈ రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా ఉంటుంది. డ్రెనేజీలు పూడిపోయి మురుగు నీరు రోడ్డును ముంచెత్తి చెరువులా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండడమే కాకుండా దుర్గంధం వస్తోందని స్థానికులు తెలిపారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో ఎక్కడ గోతులు ఉన్నాయో తెలీక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు ఒక్కోసారి భారీ వాహనాలు బోల్తా కొట్టిన సందర్భాలు ఉన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరుకుంటున్నారు.

దుర్గగుడి ఈఈ, డీఈఈ, ఏఈఈకు షోకాజ్

- అభివృద్ధి పనులు, విధుల్లో నిర్లక్ష్యమే కారణం

ఇంద్రకీలాద్రి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అభివృద్ధి పనుల అంశంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్యాచరణకు దిగటం లేదని, చెప్పిన పనులను పూర్తి చేసేందుకు ఉపక్రమించటం లేదన్న కారణంగా దుర్గగుడి ఈఈ బి.రాంబాబు, డీఈఈ వి.రవీంద్రనాథ ఠాగూర్, ఏఈఈ పి.మస్తానయ్యలకు ఈవో శీనానాయక్ శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

నోటీసు అందిన మూడు రోజుల్లో నిర్లక్ష్యానికి గల కారణాలను తెలియజేస్తూ, విధుల ఉల్లంఘనకు పాల్పడినందుకు క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోరాదో తెలియజేయాలంటూ నోటీసులో పేర్కొన్నారు. సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోయినట్లయితే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవటం జరుగుతుందని నోటీసులో వివరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శనివారం వివిధ అభివృద్ధి పనులను పరిశీలించినప్పుడు కొత్త అన్నదాన భవనంలో చెయ్యాల్సిన పనులపై పలుమార్లు సూచనలు చేసినప్పటికీ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోలేదని తెలిపారు. దసరా ఉత్సవాలకు ముందే సంబంధిత సూచనలు చేసినప్పటికీ ఆ తరువాత కూడా సంబంధిత పనులను తీసుకోలేదన్నారు. బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా ఇంజనీరింగ్ స్టాఫ్ వ్యవహరిస్తోందని ఈవో నోటీసులో పేర్కొన్నారు. రాయబార మండపం పక్కన ఐరన్ మెట్లను ఏర్పాటు చేయాల్సిందిగా చెప్పినప్పటికీ చేయలేదన్నారు. డోనర్ సహకారంతో అదనంగా ఐరన్ మెట్లు వేయాలని తలపెట్టినట్లు తెలిపారు. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, బీటీరోడ్డు మధ్యలో ర్యాంప్ వేయాలని చెప్పినప్పటికీ ప్రా రంభించలేదన్నారు. కొత్త అన్నదానం భవనం నుంచి స్క్రాపింగ్ మెటీరియల్‌ను తరలించలేదని పేర్కొన్నారు. శ్లాబ్ నుంచి నీరు కారుతున్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. రూఫ్ టాప్‌పై సపోర్ట్ వాల్ నిర్మించాలని చెప్పిన చేలేదన్నారు. అన్నదానం బిల్డింగ్ ఆవరణలో పనికి రాని, వినియోగించని స్క్రాప్‌ను కాంట్రాక్టర్ తొలగించకపోవటంపై కూడా నిర్లక్ష్యం వహించారన్నారు. దసరా ఉత్సవాల సమయం నుంచి కూడా ఇదే కొనసాగుతోందని నోటీసులో పేర్కొన్నారు.

నిర్లక్ష్యం, పర్యవేక్షణాలోపం, విధుల్లో చోటుచేసుకున్నాయని నోటీసులో పేర్కొన్నారు. భవానీదీక్షలు కూడా వస్తున్నందున అత్యవసరమైన పనులను కూడా చేపట్టలేదన్నారు. భక్తుల సౌకర్యాల దృష్ట్యా పనులు వేగంగా చేయాల్సి ఉందని, భవానీదీక్షాదారులకు కొత్త అన్నదాన భవనంలోనే అన్నవితరణ చేయాల్సి ఉందని తెలియజేశారు. ఇంజనీరింగ్ విభాగం చాలా పేలవంగా వ్యవహరిస్తుందని నోటీసులో స్పష్టం చేశారు.



అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఈవో శీనానాయక్

పనుల నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదు : ఈవో

ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈవో వి.కె.శీనానాయక్ శనివారం పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా జరుగుతున్న పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈవో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలు, మంచినీటి సరఫరా, ప్రసాదం కౌంటర్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అన్ని విభాగాలలో మెరుగైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. కొండ దిగువన ఏర్పాటు చేయనున్న అన్నదాన భవనం, లడ్డూ పోటు (కిచెన్) నిర్మాణాల ప్రణాళికలను ఇంజినీరింగ్ అధికారులతో చర్చించామన్నారు. ఆక్రమణల నుంచి స్వాధీనం చేసుకున్న స్థలంలో ఏర్పాటు చేసిన భక్తుల సేవా కేంద్రం, టికెట్ల విక్రయ కౌంటర్లు, పార్కింగ్ సదుపాయాలను తనిఖీ చేశారు. పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటం ప్రధాన లక్ష్యమన్నారు. ఈవో వెంట ఈఈ-2 రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

రైల్వేస్టేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొన్ని ప్రత్యేక రైళ్లను మరికొన్నిరోజులపాటు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 04131 కాన్పూర్ సెంట్రల్ - ఎస్ఎంవీటీ బెంగళూరు ఈనెల 16 నుంచి 30వ తేదీ వరకు నడుస్తుంది. 04132 ఎస్ఎంవీటీ బెంగళూరు - కాన్పూర్ సెంట్రల్ ఈనెల 19 నుంచి డిసెంబరు3 వరకు నడుస్తుంది. 07189 హెచ్.ఎస్.నాందేడ్ - ధర్మవరం డిసెంబరు 5 నుంచి మార్చి 27 వరకు కొనసాగుతుంది. 07190 ధర్మవరం - హెచ్.ఎస్.నాందేడ్ డిసెంబరు 7 నుంచి మార్చి 29 వరకు కొనసాగుతుంది. 07059 సికింద్రాబాద్ - అనకాపల్లి ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు కొనసాగుతుంది. 07060 అనకాపల్లి - సికింద్రాబాద్ ఈనెల 11 నుంచి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. 07003 చర్లపల్లి-ధర్మవరం డిసెంబరు 7 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుంది. 07004 ధర్మవరం-చర్లపల్లి డిసెంబరు 8 నుంచి 29వ తేదీ వరకు కొనసాగుతుంది. 07011 చర్లపల్లి - తిరుపతి డిసెంబరు 5 నుంచి 27వ తేదీ వరకు కొనసాగుతుంది. 07012 తిరుపతి - చర్లపల్లి డిసెంబరు 6 నుంచి 27వ తేదీ వరకు కొనసాగుతుంది.

యశ్వంత్‌పూర్ - భాగల్పూర్ ప్రత్యేక రైలు

యశ్వంత్‌పూర్-భాగల్‌పూర్ మధ్య ఈనెల 10వ తేదీ సోమవారం నెం. 03404 ప్రత్యేక రైలు నడుపుతున్నారు.

సైబర్ నేరగాళ్లకు నకిలీ సిమ్‌లు సరఫరా

- ఐదుగురు కృష్ణా వాసుల అరెస్టు

విశాఖపట్నం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కస్టమర్లకు తెలియకుండా వారి ఐడీలతో నకిలీ సిమ్‌కార్డులు యాక్టివేట్ చేసి డిజిటల్ అరెస్టు వంటి తీవ్ర నేరాలకు పాల్పడుతూ, సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న కృష్ణాజిల్లాకు చెందిన ఐదుగురిని విశాఖ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పులి నాగతారకేశ్వరరావు, పడమట శివకృష్ణ, బల్ల నాగరాజు, యర్రా నాగ వెంకటసాయి పవన్ చందూ, షేక్ అబ్దుల్ కరీమ్‌లను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల కోసం దర్యాప్తు చేస్తున్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన యడ్ల లక్ష్మణ్ (59) బీహెచ్‌ఈఎల్ ఉద్యోగి. గత ఏడాది ఆగస్టులో మొబైల్ నెంబర్ నుంచి బెంగళూరులో పోలీసు అధికారినంటూ ఫోన్ చేశాడు. నకిలీ సిమ్ తీసుకుని దుర్వినియోగం చేస్తున్నందుకు మీపై కేసు నమోదైందని భయపెట్టి,రూ.15 లక్షలు ఇస్తే కేసు లేకుండా చూస్తామని చెప్పడంతో ఆ ఉద్యోగి పీఎఫ్ రుణం తీసుకుని రూ.10 లక్షలను ఆర్టీజీఎస్ ద్వారా పంపారు. మరో రూ.4 లక్షలు అప్పు చేసి ఇచ్చారు. మరింత డబ్బు పంపాలని వేధించడంతో బాధిత ఉద్యోగి సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. సెల్ పాయింట్లు, సిమ్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి నిందితులు నకిలీ సిమ్‌లు సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు.



స్వచ్ఛ చల్లపల్లి 11వ వార్షికోత్సవ ర్యాలీలో పాల్గొని మాట్లాడుతున్న డాక్టర్ గురవారెడ్డి

స్వచ్ఛ చల్లపల్లిని పాఠ్యాంశంగా చేర్చాలి

- డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి

చల్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఫలాపేక్ష లేకుండా స్వచ్ఛత, పరిశుభ్రత కోసం 11 ఏళ్లుగా కొనసాగిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి సేవా కార్యక్రమాన్ని పాఠ్యాంశంగా చేర్చాల్సిన అవసరం ఉందని కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి (హైదారాబాద్) ఎండీ డాక్టర్ ఎ.వి.గురవారెడ్డి అభిప్రాయపడ్డారు. స్వచ్ఛ చల్లపల్లి 11వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం స్వచ్ఛ కార్యకర్తలు గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ, వైద్య విద్యను చదువుతున్న రోజుల్లోనే డీఆర్కే ప్రసాద్ నిస్వార్థమైన నాయకుడిలా కనిపించే వారని, ఆయన వ్యక్తిత్వం, భావజాలం గొప్పవన్నారు. వైద్యరంగంలో పేరు ప్రఖ్యాతులు సాధించిన డీఆర్కే ప్రసాద్, పద్మావతి దంపతులు స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమాన్ని నిర్వహించటం, 11 సంవత్సరాలుగా కొనసాగించటం సామాన్య విషయం కాదన్నారు. కులమతాలు, రాజకీయాలకతీతంగా కార్యకర్తలు లాభాపేక్ష లేకుండా డీఆర్కే అడుగుజాడల్లో నడవటం స్ఫూర్తిదాయకమన్నారు.

స్వచ్ఛ కార్యకర్తలు లేనిదే స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం లేదన్నారు. చల్లపల్లి శ్మశానవాటిక అభివృద్ధిని, కార్యకర్తల కష్టం చూసినప్పుడు డీఆర్కే పట్ల వారికున్న ప్రేమ, స్వచ్ఛ ఉద్యమం పట్ల చిత్తశుద్ధి ఎంత గొప్పదో అర్థం అవుతుందని కార్యకర్తలను అభినందించారు.

స్వగృహ ఫంక్షన్ హాలులో జరిగిన సన్మాహక సమావేశంలో డీఆర్కే డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులు మాట్లాడుతూ, 11 సంవత్సరాల స్వచ్ఛ కార్యక్రమ ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ స్వచ్ఛ కార్యకర్తల నిస్వార్థసేవలు ఎన్నడూ మరిచిపోలేమన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, డాక్టర్ ఎం.వరప్రసాద్, డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య, ప్రాతూరి శాస్త్రి, ప్రముఖులు పాల్గొన్నారు.

వాట్సాప్ మోసం

(5వ పేజీ తరువాయి)

చేసి, ఈ రూ.2 వేల ఆఫర్ వివరాలు అందులో పోస్టు చేస్తున్నారు. అంతేకాదు.. కొంతమందికి రూ.18,500 చెల్లించామంటూ స్క్రీన్‌షాట్స్ పెడుతున్నారు. ఆఫర్ బాగుందంటూ పోలీసుల పేరుతో మెసేజ్‌లు పెట్టిస్తున్నారు. ఈ అవకాశం ఆరుగురికి మాత్రమే, నలుగురికి మాత్రమేనంటూ ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా జిల్లాలో ఎంతమంది మోసపోయారో తెలియని పరిస్థితి. సైబర్ పోలీసులు సుమోటోగా తీసుకుని కేటుగాళ్ల మోసాలకు కళ్లెం వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

గతంలో ఇలాగే..

గతంలో.. 'బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం. మీ ఏటీఎం పిన్ నంబరు గడువు అయిపోయింది. మీ పిన్ నంబరు చెప్పండి లేదా ఏటీఎం కార్డుపై ఉన్న 10 అంకెలు చెప్పండి.' అని కాల్ చేసి మోసం చేసిన ఉదంతాలు జరిగాయి. ఇలా మాయమాటలు చెప్పి బ్యాంక్ ఖాతాల్లో డబ్బు మాయం చేసేవారు. ఖాతాదారులు మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించేవారు. కానీ బాధితులకు న్యాయం మాత్రం జరిగేది కాదు. కాగా, ఇలాంటి సైబర్ నేరాలపై పోలీసులు, బ్యాంక్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించడంతో చాలామంది మేలుకున్నారు. దీంతో ఆ విధానానికి సైబర్ నేరగాళ్లు స్వస్తి పలికారు. ఇప్పుడు కొత్తగా ట్రస్టుల పేరుతో మోసం చేయడం ప్రారంభించారు.

చిన్న మొత్తాలతో పెద్ద నేరాలు

ఇప్పుడు సైబర్ మోసగాళ్లు పంథా మార్చారు. పెద్ద మొత్తంలో దండుకోకుండా జాగ్రత్త పడుతున్నారు. కేవలం రూ.20 వేలు, రూ.30 వేలను ఎక్కువ మంది వద్ద లాగేస్తున్నారు. అలాగే, 'అర్జెంట్ పని ఉంది. ఇంటికి కాల్ చేసుకోవాలి. ఒకసారి ఫోన్ ఇస్తారా..' అని ఎవరైనా అపరిచితులు ఫోన్ అడిగితే ఇవ్వకపోవడమే మంచిది. ఫోన్ తీసుకుని సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటన ఇటీవల జగ్గయ్యపేటలో జరిగింది.

తిరువూరు ఆర్డీవో పేరుతో..

ఇటీవల సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు తిరువూరు ఆర్డీవో పేరుతో ఒక ఫేక్ అకౌంట్‌ను క్రియేట్ చేసి 8553236906 నంబరుకు రూ.8 వేలు పంపాలని సందేశాన్ని పంపారు. సకాలంలో ఈ విషయాన్ని గమనించిన రెవెన్యూ అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె మైలవరం ఏసీపీ, సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబరుకు, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.

నకిలీ యాప్‌లను నమ్మొద్దు

నకిలీ యాప్‌లను నమ్మవద్దు. ఇటీవల కొన్ని నకిలీ యాప్‌లలో రూ.2 వేలు జమచేస్తే.. రూ.18,500 తిరిగి ఇస్తామంటూ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. అటువంటి వారిని నమ్మవద్దు. ఈ నకిలీ యాప్‌లన్నీ మల్టీ లెవల్ మార్కెటింగ్ తరహాలో మోసం చేస్తున్నాయి.

- గురుప్రకాష్, వన్‌టౌన్ సీఐ

అందరికీ అందుబాటులో అమ్మ ప్రసాదం

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. దీనిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

యాప్ కూడా..

దేవస్థాన అధికారులు గత ఏడాది దీక్షల్లో ఒక యాప్‌ను ఆవిష్కరించారు. దా న్ని ఈ ఏడాది భవానీ దీక్షల విరమణకు మళ్లీ తీసుకురావాలని నిర్ణయించారు. ఇందులోనూ లడ్డూలను బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని భావించారు. యా ప్ ద్వారా బుక్ చేసుకున్న వారికి లడ్డూలకు సంబంధించిన చెల్లింపులు పూర్తయ్యాక ఒక కోడ్ వస్తుంది. ఆ కోడ్‌ను కౌంటర్‌లో చూపిస్తే లడ్డూలు ఇస్తారు. ఇలా చేయడం వల్ల ఏ రోజు ఎన్ని ల డ్డూలు అవసరమవుతాయో లెక్క పక్కా గా తెలుస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈ విధానాన్ని గత ఏడాదే అమలు చేయాలని భావించినా ప్రజల్లోకి వెళ్లకపోవడంతో పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయామని అధికార వర్గాలు తెలిపాయి.

ఆసుపత్రిలో ఆ ఇద్దరు

(5వ పేజీ తరువాయి)

వివాదాస్పదమైంది. దీంతో ఈ ఇద్దరు ఉద్యోగుల పనితీరుపై ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు వెళ్లడం గమనార్హం. మహిళ ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలంటే వీరు అడిగినంత ముట్టజెప్పాల్సిందే. మళ్లీ రీజాయినింగ్ ఉత్తర్వులు ఇవ్వాలన్నా వీరు అడిగినంత ఇవ్వాల్సిందే. ఉద్యోగులకు సంబంధించిన ఇంక్రిమెంట్లు, పదోన్నతులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల మంజూరుకు, ఇతరత్రా సౌకర్యాలు వర్తింపజేసేందుకు కూడా ప్రతి ఫైలుకు ఇంత రేటు అని నిర్ణయించి ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారని, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసినా వారు పట్టించుకోవడంలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

వికాస్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

విజయవాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమం జరిగింది. బెంగుళూరుకు చెందిన ప్రముఖ ఐటీ సంస్థ ఫస్ట్‌సోర్స్ నిర్వహించిన ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 146 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ నర్రెడ్ల సత్యనారాయణరెడ్డి, ప్రధాన హెచ్‌ఆర్‌ఎం అరుల్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్లేస్‌మెంట్ అధికారి జి. వడ్డీకాసులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

గుంతలమయం!

- కానూరు న్యూఆటోనగర్‌లోని రోడ్లపై గుంతలు
- గుంతల్లో వర్షపు, డ్రెయినేజీ నీరు
- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని ఐలా అధికారులు



అధ్వానంగా కానూరు న్యూ ఆటోనగర్ మెయిన్ రోడ్డు

(కానూరు - ఆంధ్రజ్యోతి)

తాడిగడప మున్సిపాలిటీ పరిధి కానూరు న్యూ ఆటోనగర్‌లోని రోడ్లు అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తున్నాయి మెయిన్‌రోడ్డుతోపాటు అంతర్గత రోడ్లలో సైతం పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపునీరు చేరడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ద్విచక్ర వాహన చోదకులు నుంచి పాదచారుల వరకు ఈగుంతల్లో పడి గాయాలపాలవుతున్నారు. వివిధ పరిశ్రమల ఉత్పత్తుల నిమిత్తం భారీ వాహనాలు కానూరు న్యూఆటోనగర్‌కు వస్తుంటాయి. సరుకుతో ఉండే భారీవాహనాలు గుంతల్లో పడిప్రమాదానికి గురవుతున్నాయి. ముఖ్యంగా సరైన డ్రెయినేజీ వ్యవస్థలేక పోవడంతో మురుగు కూడా రోడ్లపైకి వచ్చి దుర్వాసన కొడుతోం దని స్థాని కులు ఆరోపిస్తున్నారు. సుమారు రెండు న్నర దశాబ్దాల క్రితం కానూరు న్యూఆటోనగర్ ఏర్పడి నా నేటికీనీ మౌలిక సౌకర్యాలు మెరుగుపడ లేదని వారు అంటున్నారు. ఏడాదికి ఆస్తిపన్ను రూపేణా ఐలాకు రూ. కోటి వరకు చెల్లిస్తున్నామని హౌస్ హోల్డర్స్ ఆరోపిస్తున్నారు. ఈ విషయం పలుసార్లు ఐలా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం శూన్యమని వారు అంటున్నారు. ఏపీఐఐసీ ఉన్నతా ధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



అంతర్గత రోడ్లపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

మహోన్నతుడు సురేంద్రబాబు

- మంచి పారిశ్రామికవేత్తను కోల్పోవడం బాధాకరం
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం ఏబీ కన్వెన్షన్ సెంటర్లో సురేంద్రబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం(ఉంగుటూరు), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి ముక్కామల సురేంద్రబాబు ఆకస్మిక మరణం బాధాకరమని, ఆయన లేని లోటు పారిశ్రామికరంగానికి, తెలుగుదేశంపార్టీకి తీర్చలేనిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఇటీవల మరణించిన సురేంద్రబాబు దశదినకర్మ కార్యక్రమంలో భాగంగా సంస్మరణ సభ శనివారం గన్నవరంలోని ఏబీ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన యార్లగడ్డ తొలుత సురేంద్ర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసంగిస్తూ చిక్కవరంలో 1959లో జన్మించిన సురేంద్రబాబు తల్లిదండ్రులైన వెంకయ్య, కనకమ్మ దంపతుల నుంచి దానగుణం, సేవాగుణాన్ని పుణికిపుచ్చుకుని నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. గన్నవరం, చిక్కవరం, పెదఅవుటపల్లిలో పరిశ్రమలను స్థాపిం చడం ద్వారా ఎంతోమంది యువతకు ఉపాధి కల్పించి ఎన్నో వేల కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. విలువలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న సురేంద్రబాబు మంచి పారిశ్రామికవేత్తగా ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. సురేంద్రబాబు సతీమణి రజిత బదరి విశాలాక్షి(పండమ్మ), కుమార్తెలుపూజిత, పూర్ణిమలు కూడాఆయన అడుగుజాడల్లో నడుస్తూ మంచితనానికి మారుపేరుగా నిలిచారన్నారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణం రాజు, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, కామినేని శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, చింతమనేని ప్రభాకర్, గద్దె అనూరాధ, బొప్పన భవకుమార్, దామచర్ల సత్య, మాజీ ఎమ్మెల్యేలు దాసరి వెంకటబాలవర్ధనరావు, ముసునూరి రత్నబోస్, వల్లభనేని వంశీ, సినీ నిర్మాత కేఎల్ నారాయణ, పారిశ్రామికవేత్తలు, సురేంద్రబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రూ. 200 కోట్లతో అభివృద్ధి పనుల ప్రణాళిక

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కాటూరు రోడ్డులో అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రానున్న జనవరి నాటికి రూ. 200 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు పూర్తిచేసేలా ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళుతున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.18లక్షలతో సీసీ డ్రెయినేజి నిర్మాణం, రూ. 20లక్షలతో డ్రెయిన్, డ్రెయినేజి స్లాబు, రూ. 14 లక్షలతో కాటూరు రోడ్డులో సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంతో పాటు రూ. 40లక్షలతో నిర్మించిన తారురోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చే జనవరిలోపు రూ. 200 కోట్ల మేరకు అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీలో ఇప్పటివరకు రూ. 6 కోట్లతో అభివృద్ధిపనులు పూర్తిచేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కళ్యాణ్ సారథ్యంలో అభివృద్ధి పనులు చేయగలిగామన్నారు. మున్సిపల్ చైర్మన్ వి.సత్యనారాయణ, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, కౌన్సిలర్లు, ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ జయదేవ్, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

కంకిపాడు: గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీ నాయకులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా పునాదిపాడు మాజీ సర్పంచ్ జంపని వెంకటేశ్వరరావును ప్రకటించటంతో పాటు శనివారం ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, బడుగు బల హీన వర్గాల అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన జంపని వెంకటేశ్వరరావుకు మండలంలోనే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, తెన్నేరు డీసీ యార్లగడ్డ రాజా, మండల ప్రధాన కార్యదర్శి పావనమూర్తి, మండలంలోని 20 గ్రామాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్కిల్ పోటీలకు కానుమోలు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం పద్మజ, ట్రైనర్ షాలిని

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : ఇష్టంతో కూడిన విద్య ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని హెచ్‌ఎం పద్మజ విద్యార్థులకు సూచించారు. కానుమోలు హైస్కూల్ (పీఎం శ్రీ)కు చెందిన విద్యార్థులు స్కిల్ (ఫుడ్ అండ్ న్యూట్రీషన్) పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడంతో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్కిల్ పోటీల్లో సీహెచ్.ఉమాదేవి, జె. బాలచంద్రిక ప్రతిభ కనబరచి మొదటిస్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని ఫుడ్ ప్రాసెసింగ్ ట్రైనర్ టి. షాలిని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన షాలినీని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



హనుమాన్‌జంక్షన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శ్రీభ్రమ రాంబ సమేత శ్రీశైల బ్రహ్మసూత్ర మరకత మల్లికార్జున స్వామి దేవ స్థానంలో శనివారం వైభవంగా ప్రథమ వార్షిక బ్రహ్మో త్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వ తేదీ వరకు దేవస్థా నంలో వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు నూతన నవ గ్రహ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు కోసూరి మురళీ కృష్ణ మాచార్యులు, బుచ్చి రామశర్మ, ఆలయ అర్చకులు సామ వేదం మారుతిశర్మ గణపతి పూజ, దీక్షాధారణ, అంకురార్పణ, నూతన విగ్రహాలకు పంచగవ్య శుద్ధి, జలాధివాసం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గూడ వల్లి చిన్నా, సభ్యులు తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పాడి రైతుల్లో జానకిరామయ్యకు సుస్థిరస్థానం

- జానకిరామయ్య సంతాప సభలో విజయ డెయిరీ చైర్మన్ చలసాని



మండవ జానకిరామయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ అభివృద్ధికి మండవ జానకి రామయ్య చేసిన కృషి కారణంగానే ఈ రోజు పాడి రైతు సగర్వంగా నిలబడి మనుగడ సాగిస్తున్నట్లు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో చలసాని ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పూర్వపు విజయ డెయిరీ చైర్మన్ మండవ జానికిరామయ్యకు నివాళి అర్పిస్తు సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు జంక్షన్ పాలశీతల కేంద్రం క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తి సంఘాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు హాజరయ్యారు. ముందుగా జానకిరామయ్య చిత్రపటానికి చలసాని పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ, కృష్ణామిల్క్ యూనియన్ ఆర్థికంగా నిలదొక్కుకున్న తరువాత పాడి రైతులకు మొదటి సారిగా బోనస్ అమలు చేసిన ఘనత జానకిరామయ్యకు దక్కుతుందన్నారు. యూనియన్ బలోపేతం కావడానికి ఆయన అమలు చేసిన ఆర్థిక సంస్కరణలతో యూనియన్ మరింత పుంజుకుందన్నారు. పాడిరైతు సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. పాడి రైతుల్లో జానకి రామయ్య చెరగని ముద్రవేశారన్నారు. పాడి రైతు ఉన్నంత వరకు జానకిరామయ్య చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో గ్రామాల్లో సంఘాలను, యూనియన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి సమిష్టి కృషి అవసరమని చలసాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి, పాలశీతల కేంద్రం మేనేజర్ మాగంటి హరిబాబు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఉయ్యూరు విద్యార్థులు

ఉయ్యూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు, స్కిల్ కాంపిటేషన్ పోటీల్లో ఉయ్యూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గూడూరులో జరిగిన అండర్-14 బాలుర కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో 9వ తరగతి విద్యార్థి పప్పుల లక్ష్మీహేమంత్ అత్యంత నైపుణ్యం ప్రదర్శించి మచిలీపట్నంలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. అదేవిధంగా మచిలీపట్నంలో జరిగిన స్కిల్ కాంపిటేషన్‌లో పాఠశాల 10వ తరగతి విద్యార్థులు పాలపర్తి వంశీకృష్ణ, సయ్యద్ అజీమ్ విశేష ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే విద్యార్థులను, వీరికి శిక్షణ నిచ్చిన ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ బాలస్వామి, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందించారు.

హత్యాయత్నానికి పాల్పడిన యువకుడి అరెస్టు

గుడివాడ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం వలివర్తిపాడు గ్రామ పరిధిలోని గణేష్ అపార్టుమెంట్ సమీపంలో యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నం చేసిన కేసులో బీహార్ యువకుడిని అరెస్టు చేసినట్లు గుడివాడ తాలుకా ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ, బాధితుడు అన్షుకుమార్‌తో పాటు గుడివాడ వచ్చిన చందన్‌కుమార్ కనిపించక పోవడంతో అనుమానంతో అతని కోసం వెదుకులాట ప్రారంభించామన్నారు. పథకం ప్రకారం వలవేసి నింది తుడిని పట్టుకున్నామన్నారు. నిందితుడు గత రెండు సంవత్సరాలుగా విజయవాడ జక్కంపూడిలోని డెయిరీ ఫారంలో పనిచేస్తున్నాడు. తనతో పాటు రాష్ట్రానికి వచ్చిన బీహార్‌కు చెందిన అన్షుకుమార్ కూడా గుడివాడలోని దేవదత్త చౌదరికి చెందిన డెయిరీ ఫారంలో పనిచేస్తున్నాడని, ఈ నెల 5న గుడివాడ వచ్చిన వీరివురి మధ్య డబ్బుల విషయంలో వివాదం చోటుచేసుకుంది. కోపంతో అన్షుకుమార్‌పై కత్తితో దాడి చేశాడు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



పెనమలూరు,నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కానూరులో నేరెళ్ల శోభన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ, కలశ పూజ కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన పడిపూజ కార్యక్రమానికి వేదపండితులు శ్రీపద్మనాభన్ నంబూద్రి, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌లు హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. గురుస్వామి పప్పా గురుస్వామి అయ్యప్పలకు అవసరమయిన ఏర్పాట్లను చూశారు. కార్యక్రమంలో నేరెళ్ల సుబ్రహ్మణ్యం, నేరెళ్ల నాగేశ్వరరావు, నేరెళ్ల నారాయణ, నేరెళ్ల దుర్గాప్రసాద్, నేరెళ్ల శోభన్ బాబు, చాగంటిపాటి జగన్‌మోహన్‌రావు, బన్నీ, శోభన్ పడిపూజ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వీరవల్లి ప్రాజెక్ట్ కామధేనులో హనుమాన్‌చాలీసా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : వీరవల్లి ప్రాజెక్ట్ కామధేను (విజయపాల ఫ్యాక్టరీ) ఆవరణలోని శ్రీదాసాం జనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. ఈ రోజు ఎక్కడినుంచో వచ్చిన కపీశుడు పారాయణం పూర్తయ్యేవరకూ స్వామి వారి విగ్రహం ప్రక్కన కూర్చుని వినడం ఆసక్తికరంగా మారింది. భక్తులను ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా హనుమాన్ చాలీసా పారాయణం పూర్తయ్యే వరకూ అలాగే కూర్చుని ఉండటంతో పాటు శ్రీరామ నామస్మరణ చేస్తున్నప్పుడు చేతులు జోడించడం ఆశ్చర్యానికి గురిచేసింది, హనుమన్ చాలీసా పారాయణం అనంతరం ప్రసాదాన్ని తీసుకుని వెళ్లిపోయిందని భక్తులు తెలిపారు. పాడి రైతు కుటుంబాలతో పాటు ప్రాజెక్ట్ కామధేనుకు దాసాంజనేయస్వామి ఆశీస్సులు అందించారని చైర్మన్ చలసాని ఆంజనేయులు భక్తి పూర్వకంగా తెలిపారు.

ఉరేసుకుని ఆత్మహత్య

పెనమలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భార్యభర్తల మధ్య గొడవతో మనస్తాపం చెందిన భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోపిదేవి మండలం పెదకళ్లేపల్లికి చెందిన కొకికలిగడ్డ రమేష్, సజీవ దంపతులు పోరంకిలోని ఒక అపార్టుమెంటులో నాలుగు నెలలుగా వాచ్‌మన్ పనిచేస్తున్నారు. రమేష్‌కు మద్యం సేవించే అలవాటు ఉంది. ఈ నెల ఆరున భార్యభర్తలకు గొడవ జరగ్గా భర్త రమేష్ భార్య సజీవను ఇంటి నుంచి గెంటివేశాడు. దీంతో ఆమె తన స్వగ్రామానికి వెళ్లిపోయింది. తర్వాత ఎనిమిదిన అపార్టుమెంటులోని సెల్లార్ గదిలో రమేష్ కేబుల్ వైరుతో ఉరివేసుకుని మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నున్న పీఏసీఎస్‌కు రూ. 2.14 కోట్లు లాభం

విజయవాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న పీఏసీఎస్ 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 2.14 కోట్లు లాభం గడించినట్లు సొసైటీ చైర్మన్ కలకోటి శ్రీనివాసరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లాభంలో ఈ నెల 10న సొసైటీ సభ్యులకు రూ. 39.46 లక్షలు డివిడెండ్ పంపిణీ చేయనున్నట్లు తెలియజేశారు. అలాగే సొసైటీ మల్టీపర్పస్ గొడౌన్ మొదటి అంతస్తు, రెండవ అంతస్తుల ఆవరణలో కల్యాణ మండపం, డైనింగ్ హాల్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా కిషోర్

హనుమాన్‌జంక్షన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డు శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా పెదపారుపూడి గ్రూపు దేవాలయాల ఈవో కిషోర్ శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈవోగా గుడివాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో యార్లగడ్డ శ్రీనివాస్ బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో పెదపారుపూడి గ్రూపు ఆలయాల బాధ్యతలు చూస్తున్న కిషోర్‌కు వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు కానుమోలు గ్రూపు ఆలయాలకు కూడా బాధ్యత అప్పగించారు.

సీసీఐకి శఠగోపం

» కేంద్రాలు ప్రారంభం కాకుండానే దూది బేళ్లు సిద్ధం

» కాటన్ కార్పొరేషన్ నమూనాలో ప్యాకింగ్

» ఒక్కటైన జిన్నర్లు, బయ్యర్లు.. సీఎండీ, విజిలెన్స్‌కు ఫిర్యాదులు



పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేందుకు గుంటూరులో గుర్తించిన జిన్నింగ్ మిల్లులో సీసీఐ నమూనాలో సిద్ధం చేసిన దూది బేళ్లు

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

గుంటూరు జిల్లా పత్తి వ్యాపారులు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి శఠగోపం పెడుతున్నారు. సీజన్‌లో అధికారికంగా ఇంకా కొనుగోలు ప్రక్రియ ఆరంభం కాకుండానే సీసీఐకి బేళ్లు సిద్ధం చేస్తుండటం వెలుగులోకి వచ్చింది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఇదే తంతు కొన్ని చోట్ల కొనసాగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలోనూ, పక్కనే తెలంగాణలోనూ నెమ్ము ఎక్కువగా ఉందన్న కారణంతో సీసీఐ పత్తి కొనుగోలు చేయటం లేదు. ఆ నేపథ్యంలో రైతుల నుంచి అదే పత్తిని వ్యాపారులు కారు చౌకగా కొనుగోలు చేసి జిన్నింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఈ తంతు అంతా గుంటూరులో ఇప్పటికే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు గుర్తించిన మిల్లుల్లోనే ఎక్కువగా జరుగుతోంది. నాసిరకం పత్తితో తయారు చేసిన దూది బేళ్లను సీసీఐ నమూనాలో ప్యాక్ చేసి గౌడన్లకు తరలిస్తున్నారు. సీజన్ ఆరంభమయ్యాక అవే దూది బేళ్లను సీసీఐ ఖాతాలోకి నెట్టేస్తారు. ఇందులో బయ్యర్ల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న ఈ వ్యవహారం బహిర్గతం కావటంతో కలకలం రేగుతోంది. గుంటూరు సమీపంలోని కొన్ని జిన్నింగ్ మిల్లుల్లో కృష్ణా జిల్లాకు సంబంధించిన పత్తి కొనుగోలు కేంద్రాలు ఎంపిక చేశారు. అలా ఎంపికైన ఒక కేంద్రంలో సీసీఐ నమూనాలో దూది బేళ్లు సిద్ధం చేస్తున్నారు.

నిద్ర పోతున్న నిఘా

కొన్ని సీసీఐ కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నట్టు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. అయినా సీసీఐ ఏర్పాటు చేసిన నిఘా విభాగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. నాసిరకం పత్తిని తీసుకువచ్చి జిన్నింగ్ చేసి సీసీఐ నమూనాలో ప్యాక్ చేస్తున్నా సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అక్రమాలపై సీసీఐ విజిలెన్స్‌కి కూడా ఫిర్యాదులు వెళ్లినా పెద్దగా స్పందన లేదు. గుంటూరులో దూది బేళ్లను సిద్ధం చేస్తున్న వ్యవహారంపై సీసీఐ సీఎండీకి ఫిర్యాదులు వెళ్లాయి. ఈ వ్యవహారంలో సీసీఐ అధికారుల హస్తం కూడా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అమరేశ్వరుని సన్నిధిలో జస్టిస్ సుబ్బారెడ్డి



జస్టిస్ సుబ్బారెడ్డి దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రేఖ

అమరావతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి దంపతులు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. న్యాయమూర్తి దంపతులకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారి పేరున స్వామివార్లకు పూజలు నిర్వహించి, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. దేవస్థానం ఈవో రేఖ న్యాయమూర్తి దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

'యువ ఆపద మిత్ర'లు సిద్ధం

» విపత్తులపై ఒడిశాలో 52 మందికి శిక్షణ

అమరావతి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తుఫాన్ల వంటి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవటానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన యువ ఆపద మిత్ర పథకంలో ఏపీ నుంచి 52 మంది ఎంపికయ్యారు. వీరందరికీ గత నెల 13 నుంచి ఈ నెల 7 వరకు ఒడిశా విపత్తుల నిర్వహణ సంస్థలో శిక్షణ ఇచ్చారు. 21 రోజులపాటు శిక్షణ పొందిన యువ ఆపద మిత్రలు శనివారం తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్‌ను కలిశారు. ఈ ఆపద మిత్రలు రాష్ట్రంలోని ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర సభ్యులు, స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన 12,360 మందికి ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, అగ్నిమాపక శాఖల సిబ్బందితో కలిసి శిక్షణ ఇవ్వనున్నారు. తుఫాన్లు, వరదలు, వడగాడ్పులు, పిడుగుపాట్లు, అగ్ని ప్రమాదాల సమయంలో ప్రజల్ని ఏవిధంగా రక్షించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు.

నంద్యాలలో యూరాలజీ వైద్యుల సదస్సు

» తెలుగు రాష్ట్రాల నుంచి హాజరైన 300 మంది వైద్యులు



జ్యోతి వెలిగిస్తున్న డాక్టర్ విక్రమసింహారెడ్డి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల జెనిటోయూరినరీ సర్జన్స్ సొసైటీ రాష్ట్ర స్థాయి సదస్సును ఉస్మానియా ఆస్పత్రి విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ విక్రమసింహారెడ్డి శనివారం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల యూరాలజీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ జగదీశ్వర్ అధ్యక్షతన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి నిర్వహణలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విక్రమసింహా రెడ్డి మాట్లాడుతూ యూరాలజీ విభాగంలో గత దశాబ్ద కాలంలో అధునాతన వైద్య విధానాలు, పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అవకాశం వచ్చిందని తెలిపారు. దక్షిణ భారత యూరాలజీ సంఘం కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ యూరాలజీలో కూడా ఏఐ వినియోగంతో అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి ఆస్కారం ఏర్పడిందన్నారు. ఈ సదస్సుకు తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది యూరాలజీ వైద్యులు హాజరయ్యారు.

ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

» కనీస వేతనాలు అమలు చేయాలి: ఎమ్మెల్సీ గోపీమూర్తి

అనకాపల్లి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలను అమలు చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ పి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల రాష్ట్ర ఐదో మహాసభలు శనివారం అనకాపల్లిలో ప్రారంభమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ మీదుగా రింగురోడ్డు వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గవరపాలెంలో జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా ఆశ వర్కర్లు నేషనల్ హెల్త్ మిషన్‌లో అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇన్సెంటివ్ వెతలు

- విలేజ్ హెల్త్ ఆఫీసర్లకు ఏడు నెలలుగా అందని కమీషన్
- భవనం అద్దె, విద్యుత్ బిల్లుల మంజూరులోనూ తీవ్ర జాప్యం
- సొంత నిధులు వెచ్చిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్(వీహెచ్‌సీ)ల్లో ఆర్థిక సమస్యలు తిష్టవేశాయి. వీటిని నడిపే విలేజ్ హెల్త్ ఆఫీసర్లకు సకాలంలో కమీషన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల అద్దె ప్రాతిపదికన నిర్వహిస్తున్న క్లినిక్‌లకు అద్దె, కరెంటు బిల్లులు కూడా చెల్లించలేక సతమతం అవుతున్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి-విజయవాడ: ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 195 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఇక్కడ విలేజ్ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు ఉంటారు. వీరు గ్రామ స్థాయిలో ప్రాథమిక చికిత్స, గర్భిణులు, చిన్నారులకు టీకాలు, రక్తపోటు, మధుమేహం వంటి సాధారణ వ్యాధులకు చికిత్స, మందుల పంపిణీ, ప్రజారోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విలేజ్ హెల్త్ ఆఫీసర్‌కు వేతనం రూ.25 వేలు, పనిని బట్టి ఇన్సెంటివ్‌ను రూ.15 వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. జీతంతో పాటే ఇన్సెంటివ్ కలిపి ఇస్తోంది. గత ప్రభుత్వం వేతనాల విషయంలో ఇబ్బంది పెట్టినప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వేతనాలు కష్టాలు తీరాయి. కానీ కొందరు అధికారుల తీరు వల్ల ఏడు నెలల ఇన్సెంటివ్‌లు విలేజ్ హెల్త్ ఆఫీసర్ ఖాతాల్లో జమ కాలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తమ సమస్యలపై మార్చి 15 నుంచి ఏప్రిల్ 25 వరకు 40 రోజులపాటు సమ్మె చేశారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హామీతో సమ్మెను విరమించారు. తర్వాత ఉద్యోగులు మంత్రి, ఇతర అధికారులను కలిసినప్పటికీ ఫలితంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరెంటు, అద్దె బాధలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 60 వీహెచ్‌సీలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఈ భవనాల అద్దె, కరెంటు బిల్లులు ఏడు నెలలుగా ప్రభుత్వం చెల్లించకపోవడంతో తమ జేబులోంచి తీసి కట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. భవనాల నిర్వహణకు ఇవ్వాల్సిన నగదు అడిగితే కొందరు అధికారులు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఏడు నెలలుగా రావాల్సిన ఇన్సెంటివ్ ఇవ్వకపోగా, భవనాల నిర్వహణను తామే చేసుకుంటున్నా వాటి బిల్లుల మంజూరులో నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కో వీహెచ్‌వో సుమారు రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకు తమ జేబుల్లోంచి డబ్బులు తీసి ఖర్చుపెట్టినట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా వైద్యారోగ్య శాఖ మంత్రి తమకు ఇచ్చిన హామీ మేరకు సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

- సీఐపీఈటీ, న్యూ స్పేస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహణ
- దరఖాస్తులకు ఆహ్వానం

విజయవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సంస్థ సీఐపీఈటీ, న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్-బెంగుళూరు) సౌజన్యంతో 120 మంది నిరుద్యోగ యువతకు ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు సీఐపీఈటీ-విజయవాడ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ శనివారం తెలిపారు. మొదటి విడతగా నవంబరులో 60 మందికి, రెండో విడతలో భాగంగా డిసెంబరులో మరో 60 మందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పాసై, 18-30 సంవత్సరాల మధ్య వయసున్న తెలుగు రాష్ట్రాల నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నగరంలోని పోలిమెర్స్ టెక్నాలజీలో ప్లాస్టిక్ ప్రాసెసింగ్, ఇంజెక్షన్ మౌల్డింగ్‌లో మిషన్ ఆపరేటర్‌లుగా 113 రోజులు శిక్షణ ఉంటుందని, ఈ కాలంలో రూ.11,300 స్టైఫండ్ ఇస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికేట్‌తో పాటు చిత్తూరు, అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, మైసూర్, చెన్నైలో ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు వివరించారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సీఐపీఈటీ ప్రతినిధి 99629 79369 నంబర్లో సంప్రదించాలని కోరారు.

నూతన ఆవిష్కరణల్లో బెజవాడ బార్‌కు ప్రత్యేక స్థానం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్
- రాష్ట్ర స్థాయి న్యాయవాదుల క్యారమ్, చెస్ పోటీలు ప్రారంభం



చెస్‌ను ప్రారంభిస్తున్న జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్

విజయవాడ లీగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నూతన ఆవిష్కరణల్లో బెజవాడ బార్‌కు ప్రత్యేక స్థానం ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. ఎంతో మంది న్యాయవాదులు, త్యాగమూర్తులు ఈ బార్ నుంచే వచ్చారని కొనియాడారు. ఏపీ బార్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి న్యాయవాదుల క్యారమ్, చెస్ పోటీలను విజయవాడలోని కోర్టుల సముదాయంలో శనివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మానవేంద్రనాథ్ రాయ్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. న్యాయవాదులతో క్యారమ్, చెస్ ఆడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ ఫెడరేషన్ తరఫున ఇటువంటి పోటీలను బెజవాడలో పెట్టి న్యాయవాదుల ఐక్యతను చాటారని కొనియాడారు. బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా మాట్లాడుతూ ఈ పోటీలకు రాష్ట్రంలోని దాదాపు 148 బార్ అసోసి యేషన్‌ల నుంచి 200 మందికి పైగా న్యాయవాదులు పాల్గొంటున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా ప్రధాన న్యాయమూర్తి గుట్టల గోపి, ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ కె.సీతారాం, బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్‌కుమార్, హైకోర్టు బార్ ప్రెసిడెంట్ చిదంబరం, బార్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా తదితరులు పాల్గొన్నారు.

20 మంది చిన్నారులకు గుండె శస్త్ర చికిత్స

- ఆంధ్రా ఆస్పత్రిలో హీలింగ్ లిటిల్‌హార్ట్స్ సౌజన్యంతో నిర్వహణ



ఆపరేషన్ చేయించుకున్న చిన్నారులతో వైద్యులు, దాతలు

విజయవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్ర ఆస్పత్రిలో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన 36వ శిబిరంలో 20 మంది చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహించినట్టు ఆస్పత్రి చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ డాక్టర్ పి.వి.రామారావు తెలిపారు. ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పదేళ్లుగా ఇప్పటి వరకు 36 సార్లు నిర్వహించిన క్యాంపుల్లో అన్ని సర్జరీలు విజయవంతంగా జరిగాయన్నారు. ప్రతి రెండు, మూడు నెలలకొకసారి ఆంధ్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక కార్డియాక్ సర్జరీలు (నెలకు 50-60, ఇప్పటి వరకు 5 వేల) విజయవంతంగా నిర్వహించామన్నారు. నవ్యాంధ్రలో మొట్టమొదటిసారిగా ఇంతమంది చిన్నపిల్లలకు గుండె ఆపరేషన్లు చేయడానికి ఆసుపత్రి పీడియాట్రిక్ కార్డియాలజీ, పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ బృందాలు కలిసి పనిచేయడం వలనే సాధ్యమైందని తెలిపారు. చిన్నారుల గుండె ఆపరేషన్లకు యూకే డాక్టర్ల ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అనంతరం హీలింగ్ లిటిల్ హార్ట్స్ సభ్యుడు డాక్టర్ బాస్కో మాట్లాడుతూ గుండె సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల భవిష్యత్తు కోసం ఆంధ్రా హార్ట్ ఇనిస్టిట్యూట్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లల కార్డియాలజిస్ట్ డాక్టర్స్ విక్రమ్, చిస్టీ, కార్డియాక్ సర్జన్ డాక్టర్ నాగేశ్వరరావు, కార్డియాక్ అనస్థీషియన్ డాక్టర్ రమేష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ రఘురామ్, యూకే చారిటీ ట్రస్టు బృందం పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

- 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్
- కలెక్టరేట్‌లో వివిధ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష



కలెక్టర్ లక్ష్మీశతో కలిసి సమీక్షిస్తున్న 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ దినకర్

కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలైన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కార్యక్రమం అమలు చేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశతో కలిసి వైద్య ఆరోగ్యం, అమృత్ 1.0, అమృత్ 2.0, జల్ జీవన్ మిషన్, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్‌లపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జననీ సురక్షా యోజన (జేఎస్‌వై), జననీ శిశు సంరక్ష కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ - ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన తదితర పథకాలతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించే జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాలకు సంబంధించిన అంశాలపై సమీక్షించి, పురోగతికి అవసరమైన కార్యాచరణపై సూచనలు చేశారు. బహుళ ప్రయోజనాల సూర్యఘర్ పథకం అమల్లోనూ మరింత చొరవ చూపాలన్నారు. అనంతరం మీడియాతో లంకా దినకర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. సమావేశంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎ.విద్యాసాగర్, విజయవాడ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ సమన్వయ అధికారి డాక్టర్ జె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

భక్త కనకదాస జీవితం ఆదర్శనీయం

తత్వజ్ఞానాన్ని పామరులకు అర్థమయ్యేలా సంగీత, సాహిత్యాలతో రచనలు చేసిన ప్రముఖ తత్వవేత్త సంగీతకారుడు, స్వరకర్త భక్త కనకదాస జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. భక్త కనకదాస్ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కనకదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

భయం భయంగా విధులు

- శిథిలావస్థలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల భవనాలు
- ఊడుతున్న శ్లాబ్ పెచ్చులు.. ఆందోళనలో ఉద్యోగులు



శిథిలమైన ఇంజనీరింగ్ విభాగం పైకప్పు

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా కలెక్టరేట్ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఆ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవన సముదాయం పైకప్పు శిథిలమయింది. వర్షం వస్తే కార్యాలయంలో ఫైళ్లు తడుస్తున్నాయి. కంప్యూటర్లపై వర్షపు నీరు పడుతోంది. పెచ్చులూడి కార్యాలయం ఉద్యోగులపై పడుతున్నాయి. కార్యాలయం వరండా పిల్లర్ పూర్తిగా శిథిలమైంది. పైకప్పు శిథిలమై ఇనుప చువ్వలు కనబడుతున్నాయి. ఇంజనీరింగ్ విభాగం పైకప్పు శిథిలమైనా ఇంజనీర్లు ఏమీ చేయలేని పరిస్థితి. వర్షం వచ్చిన రోజున బిక్కు బిక్కుమంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. ఇదే కార్యాలయంలో గతంలో ఉన్న బీసీ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయాన్ని కలెక్టరేట్ పక్క వీధిలోని అద్దె భవనంలోకి మార్చేశారు. చాలా ఏళ్లుగా నూతన కార్యాలయ భవనం నిర్మించాలని ఉద్యోగులు కోరుతున్నారు. అయినప్పటికీ ఉద్యోగుల కల నెరవేరడం లేదు. వర్షాలు, తుఫానుల సమయంలో ఉద్యోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉద్యోగాలు చేస్తున్నారు.

చాకు విసరటంతో బాలుడికి గాయం

- కబడ్డీ ఆడుతుండగా బాలుర మధ్య వివాదం
- బాలుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు

జగ్గయ్యపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల మధ్య సరదాగా జరిగిన వివాదంలో ఓ బాలుడు మడత చాకు విసరటంతో 9వ తరగతి చదువుతున్న బాలుడి వీపుపై గాయమైన ఘటన పట్టణంలోని చెరువుబజార్‌లో శుక్రవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. చెరువు బజార్‌కు చెందిన నలుగురు బాలురు చెరువు వద్ద కబడ్డీ ఆడుతున్నారు. అందులో ఒకరు ఆటలో కీ చైన్‌లో వినియోగించే మడతచాకు విసరటంతో 9వ తరగతి చదువుతున్న బాలుడి కాలు వద్ద పడింది. ఆ చాకును అతడు తీసి మరో బాలుడిపై వేశాడు. అది వేసింది తాను కాదని, ఎందుకు విసిరావు అంటు అతడు మళ్లీ 9వ తరగతి విద్యార్థి వైపు బలంగా విసరట ంతో అతడు తప్పించుకునేందుకు వెనక్కి తిరిగాడు. దీంతో వెన్ను భాగంలో తగిలి గాయమైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వచ్చి బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసిన అనంతరం కిడ్నీకి సమీపంలో గాయం కావటంతో జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కారులో విజయవాడ ఆస్పత్రికి కానిస్టేబుల్‌ను ఇచ్చి పంపారు. అక్కడ బాలుడికి పరీక్షలు చేయించారు. అతడికి ప్రాణాపాయం లేదని సీఐ పి.వెంకటేశ్వర్లు చెప్పారు. సరదాగా జరిగిన వివాదమే తప్ప ఉద్దేశ్యపూర్వకంగా జరిగిన దాడి కాదని విచారణలో తేలిందని చెప్పారు. దాడికి పాల్పడిన బాలుడు ప్రస్తుతం చదవటం లేదని, చేపల మార్కెట్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు. గాయపడ్డ బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఘర్షణ కేసు నమోదు చేశామని తెలిపారు. బాలురు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇస్తామని వివరించారు.

నేషనల్ అర్బన్ కాంక్లేవ్‌కు జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ హాజరు



కాంక్లేవ్ వేదికపై అధికారులతో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో రెండు రోజుల పాటు జరగనున్న నేషనల్ అర్బన్ కాంక్లేవ్-2025కు జగ్గయ్యపేట మునిసిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరయ్యారు. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టా ముఖ్యఅతిథిగా హాజరై కాంక్లేవ్‌ను ప్రారంభించారు. తొలి రోజు అర్బన్ గవర్నెన్స్ న్యూ ఇండియా అంశంపై సదస్సు నిర్వహించారు. డిజిటల్ గవర్నెన్స్ ఇన్ అర్బన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పౌర సేవల డిజిటలైజేషన్, డేటా ఆధారిత మునిసిపల్ పాలనపై జరిగాయని చైర్మన్ రాఘవేంద్ర చెప్పారు. దేశవ్యాప్తంగా పలు పురపాలక సంఘాల్లో జరుగుతున్న సంస్కరణలను అధ్యయనం చేస్తున్నామని వివరించారు.

'క్రీస్తు' జూబ్లీ వేడుకలతో నూతన ఒరవడి

- విశాఖపట్నం అగ్రపీఠాధిపతి ఉడుమల బాల



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బిషప్ ఉడుమల బాల

భారతీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలుగు గడ్డపై యేసుక్రీస్తు జయంతి-2025 జూబ్లీ వేడుకలతో కథోలిక శ్రీసభ నూతన ఒరవడి దిశగా అడుగులు వేస్తోందని విశాఖపట్నం అగ్రపీఠాధిపతి(ఆర్చి బిషప్) ఉడుమల బాల అన్నారు. ఆంధ్ర లయోలా కళాశాల ఫాదర్ దేవయ్య ఆడిటోరియంలో శనివారం యేసుక్రీస్తు జయంతి-2025 జూబ్లీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆర్చి బిషప్ ఉడుమల బాల, విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్, తెలుగురాష్ట్రాలకు చెందిన బిషప్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్చి బిషప్ ఉడుమల బాల మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ఈ వేడుకలు మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. విజయవాడ కథోలిక పీఠం, జూబ్లీ వేడుకల కన్వీనర్ బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు మాట్లాడుతూ నిరాశ, నిస్పృహలతో కొట్టు మిట్టాడుతున్న యువతీ, యువకులకు ఈ వేడుకలు స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. అనంతరం ఆర్చి బిషప్ ఉడుమల బాల, తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన బిషప్‌లను వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, గుణదల పుణ్యక్షేత్రం రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ వల్లె జోజి బాబు, ఎడ్యుకేషనల్ డెస్క్ డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, ప్రొక్యురేటర్ ఫాదర్ కిరణ్, ఎస్ఎస్సీ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్‌రాజు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ ప్రజల ఆరోగ్య భద్రతకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కృషి చేస్తున్నారని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రజావేదికలో బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 16 నెలల కూటమి పాలనలో నియోజకవర్గంలో సుమారు రూ.4 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. నేడు 15 బాధిత కుటుంబాలకు రూ.6.95 లక్షలు విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, మార్కెట్ యార్డు ఛైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయం!

- చినుకు పడితే చెరువే
- అడుగడుగునా గోతులే
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు.. అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని స్థానికుల వినతి

(గుడ్లవల్లేరు ఆంధ్రజ్యోతి)

చినుకు పడితే చెరువులు, ఎండ వేస్తే దుమ్మురేగుతూ అగాదాల్లాంటి గోతులు. ఇది గుడ్లవల్లేరు మండలంలోని రెండు ప్రధాన రహదారుల దుస్థితి. నిధులు మంజూరయ్యాయని ప్రజాప్రతినిధుల నుంచి ప్రకటనలు వస్తాయి కానీ పనులు మాత్రం కార్యరూపం దాల్చవు. ప్రజలు ప్రజాప్రతినిధులను అడుగుతూనే ఉంటారు. కానీ రహదార్ల మరమ్మతులుగాని, పునఃనిర్మాణంకాని ఎండమావుల్లానే కనిపిస్తాయి.

గుడ్లవల్లేరు - ముదినేపల్లి రహదారి దీనికి మరమ్మతులు చేసి కూడా అర్ధ దశాబ్ధమే అవుతుందని చెప్పవచ్చు. ఈ రహదారైతే చినుకు కురిస్తే చెరువును తలపించే గోతులే. ప్రతి 30 గజాలకోసారి గోతులు దర్శనమిస్తాయి. కూరాడ లాకు దిగువున నుంచి విన్న కోట వరకూ ఇదే దుస్థితి. రహదారిలో ప్రధానంగా నిత్యం పనులకు, జీవనోపాధికి గుడ్లవల్లేరు, ముదినేపల్లి వైపు వెళ్ళే వందలాది ప్రజలకు ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయమైనా తప్పనిసరిగా ప్రయాణం చేయాల్సిందే. ఎందుకంటే ఏరోజుకారోజు పనికి వెళితే కానీ ఇల్లు గడవని కూలీల నుంచి ప్రయివేటు ఉద్యోగులు, చిరు వ్యాపారులకు నిత్యం ఈ మార్గంలో ప్రయాణం తప్పనిసరి. ఈరహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనాయని ప్రజాప్రతినిధులు, అధికారులు చెబుతున్నా పనులు మాత్రం శూన్యం.అలాగే గుడ్లవల్లేరు - అడ్డాడ ప్రధాన రహదారి పరిస్థితి అంతే. ఎమ్మెల్యే అసెంబ్లీలో మా రహదారి గురించి అడిగేశారన్న తృప్తి మినహా ఆ రహదారిలోని గ్రామస్తులకు, ప్రయాణికులకు ఒరిగింది ఏమీలేదు. నిత్యం వందలాది వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఐదేళ్ళుగా కష్టాలు తప్పట్లేదు. గుడ్లవల్లేరు నుంచి పెంజంద్ర వరకు 10 నిమిషాల్లో ప్రయాణం చేయాల్సిన వాహనాలు రహదారి దారుణంగా ఉండటం వల్ల అర్ధగంటకు పైనే సమయం పడుతుంది. చినుకు పడితే ఆరహదారిలో ప్రయాణం చేయకుండా ఉంటేనే మంచిది. విజయవాడ, పామర్రు, ఉయ్యూరు, కంకిపాడు, చల్లపల్లి రూట్‌లో గ్రామాల నుంచి గుడ్లవల్లేరు కు ఇంజనీరింగ్,డిప్లమా చదివేందుకు విద్యార్థులకు ఇదే ప్రధాన రహదారి మార్గం. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ రహదారి నిర్మాణంకు జాప్యానికి కారణం మాత్రం టెండరు పొందిన కాంట్రాక్టరు ముందుకు రావడంలేదని అధికారులు చెబుతుంటారు. ఇప్పటికైనా రహదారు లకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.




లాకులు వద్ద గుడ్లవల్లేరు-ముదినేపల్లి రహదారి పరిస్థితి.. గుడ్లవల్లేరు- అడ్డాడ రహదారిలో పెంజంద్ర వద్ద..

పీ-4తో ఆదుకోవడం అభినందనీయం

ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



బాధితురాలు బేబీతో ఎమ్మెల్యే కుమార్‌రాజా, దాత మొవ్వ రాము

పమిడిముక్కల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో పి-4 పథకం ద్వారా అభాగ్యులను ఆదుకోవడానికి ముందు కురావడం అభినందనీయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పెనుముత్సలో ఇటీవల మొంథా తుపానుకు ఇల్లుకూలిపోయి నిలువ నీడలేక ఇబ్బంది పడుతున్న కొల్లూరి బేబి పి-4 పథకం ద్వారా గ్రామా నికి చెందిన దాత మొవ్వ రాము చేసిన ఆర్థికసాయం రూ. 82,500 తో నూతనంగా ఇంటిని నిర్మించుకోగా, శనివారం దాతతో కలసి ఎమ్మెల్యే ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుఫానుకు బేబీ ఇల్లు కూలిపోయి అవస్తపడుతున్న పరిస్థితుల్లో ఆమెకు సాయం చేయాలన్న పిలుపుతో ముందుకు వచ్చిన మొవ్వ రాము అభినందనీయులన్నారు. రామును కూటమి నాయకులు, పెద్దలు అభినందించారు.

హత్యాయత్నానికి పాల్పడిన యువకుడి అరెస్టు



గుడివాడ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం వలివర్తిపాడు గ్రామ పరిధిలోని గణేష్ అపార్టుమెంట్ సమీపంలో యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తి హత్యాయత్నం చేసిన కేసులో బీహార్ యువకుడిని అరెస్టు చేసినట్లు గుడివాడ తాలుకా ఎస్సై ఎన్.చంటిబాబు తెలిపారు. శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడిని మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ బాధితుడు అన్నుకుమార్‌తో పాటు గుడివాడ వచ్చిన చందన్‌కుమార్ కనిపించకపోవడంతో అనుమానంతో అతని కోసం వెదుకులాట ప్రారంభించామన్నారు. పథకం ప్రకారం వలవేసి నిందితుడిని పట్టుకున్నామన్నారు. నిందితుడు గత రెండు సంవత్సరాలుగా విజయవాడ జక్కంపూడిలోని డెయిరీ ఫారంలో పనిచేస్తున్నాడు. తనతో పాటు రాష్ట్రానికి వచ్చిన బీహార్‌కు చెందిన అన్నుకుమార్ కూడా గుడివాడలోని దేవదత్త చౌదరికి చెందిన డెయిరీ ఫారంలో పనిచేస్తున్నాడని, ఈ నెల 5న గుడివాడ వచ్చిన వీరివురి మధ్య డబ్బుల విషయంలో వివాదం చోటుచేసుకుంది. కోపంతో అన్నుకుమార్‌పై కత్తితో దాడి చేశాడు. దాడి అనంతరం రక్తపుమరకలు ఉన్న కత్తిని, దుస్తులను, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. మొబైల్‌లో అన్నుకుమార్ గాయాలతో ఉన్న వీడియోలు, ఫోటోలు ఉన్నాయన్నారు. నిందితుడు చందన్‌కుమార్‌ను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై చంటిబాబు తెలిపారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నసమారాధన నేడు

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంటుమిల్లి రోడ్డులో వేంచేసియున్న భీమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలను అత్యంత వైభవంగా ముగిసిన సందర్భంగా శాంతి నిమిత్తం ఈ నెల 9న ఆదివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. శనివారం స్థానిక దేవస్థాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నదానం నిమిత్తం విరాళాలు అందించే దాతలు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ పట్టపు చిన్న, సభ్యులు పాల్గొన్నారు.



డ్రాయింగ్ పోటీల్లో శ్రీసాయి షైనింగ్ స్టార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీ సాయి షైనింగ్ స్కూల్ విద్యార్థులు నేషనల్ లీగల్ సర్వీస్ డేలో భాగంగా గుడివాడ జిల్లా కోర్టులో నిర్వహించిన 'ఆడపిల్లలను రక్షించండి' అనే అంశంపై పది మంది విద్యార్థులు పెయింటింగ్ వేశారు. ఈ డ్రాయింగ్ పోటీల్లో శ్రీసాయి షైనింగ్ స్టార్ విద్యార్థులు విజయం సాధించగా, బహుమతులు అందజేశారు. ఈవిద్యార్థులకు 11వ అడిషనల్ జడ్జి జి.సుబ్రహ్మణ్యం బహుమతులు అందజేశారు. స్కూల్ కరస్పాండెంట్ లింగమనేని జగదీష్, లింగమనేని స్రవంతి, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి

అంతర్ జిల్లాల చాంపియన్స్‌గా ఎన్‌టీఆర్ స్టేడియం స్కేటింగ్ క్రీడాకారులు

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ఈనెల 2నుండి 5వ తేదీ వరకు ఇందిరాగాంధీ పార్క్‌లో 37వ అంతర్ జిల్లాల రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ స్కేటింగ్ పోటీల్లో చాంపియన్‌లుగా ఎన్‌టిఆర్ స్టేడియం క్రీడాకారులు నిలిచారని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక స్టేడియం ఆవరణలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. స్టేడియం క్రీడాకారులు ప్రతిభ కనబరచి అంతర్ జిల్లాల స్కేటింగ్ పోటీల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు యలవర్తి పేర్కొన్నారు. పతకాలు గెలిచిన క్రీడాకారులు, కోచ్ వి.రాజలను స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు, సిబ్బంది అభినందించారు.



పూర్ణాహుతిని సమర్పిస్తున్న దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు

వైభవంగా శ్రీలక్ష్మీ గణపతి హోమం


గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసి యున్న విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో సంకటహర చతుర్ధి, పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని లోక కళ్యాణార్ధం దేవస్థాన మండపంలో శ్రీలక్ష్మీగణపతి హోమ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ హోమ పూజలో 130 మంది దంపతులు పీటలపై కూర్చున్నారు. హోమ పూజ అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈకార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు(వాసు), కమిటీ ఛైర్మన్ సాయన రాజేష్, సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



గంగానమ్మకు చలినైవేద్యం సమర్పణ

గుడ్లవల్లేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరు గంగానమ్మ అమ్మవారి సంబర మహోత్సవాల్లో రెండవ రోజు శనివారం అమ్మవారికి చలినైవేద్యం సమర్పించే కార్యక్రమాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి భక్తులు కనకడప్పులతో, పంబల డప్పులతో గ్రామోత్సవంగా బయలుదేరారు. అక్కడి నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో ప్రతీ హిందువు ఇంటి నుంచి అమ్మవారికి చలినైవేద్యాన్ని సమర్పించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు డానిష్ ఎంపిక



పామర్రు, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఈనెల 7న ఆర్.ఎస్.ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ రాష్ట్రస్థాయి రోలర్ స్కూటర్ స్కేటింగ్ క్వార్డ్ విభాగంలో విజేతగా నిలిచి వెండి పతకం సాధించిన డానిష్ సమర్‌కుమార్ త్వరలో విశాఖపట్నంలో జరగబోయే జాతీయస్థాయి రోలర్ స్కూటర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక య్యాడు. గ్రామీణ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయి పోటీలకు డానిష్ ఎంపిక కావడం గర్వకారణమని కురుమద్దాలి ప్రజలు ప్రశంసల జల్లులు కురిపించారు. డానిష్‌కు ప్రత్యేక తర్ఫీదునిచ్చిన కోచ్ నాగసేన్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

కార్తీక వన సమారాధనలు మంచి సంప్రదాయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



భోజనాలు వడిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు,నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలు క్రమం తప్పకుండా ప్రతి యేటా ఐక్యమత్యంగా నిర్వహించుకోవడం మంచి సంప్రదాయమని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక విష్ణాలయంలో శనివారం రజక సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా హజరై ఆలయంలో ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దైవ ఆశీస్సులతో అందరూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం జరిగిన సహపంక్తి భోజనాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పెందుర్తి మహేష్, పలువురు భవానీ దీక్షాపరులు పాల్గొన్నారు.

స్కిల్ పోటీల్లో తాడంకి విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

పమిడిముక్కల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన స్కిల్ కాంపిటేషన్‌లో తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరచారు. ఈనెల 3న పాఠశాల స్థాయిలో నిర్వహించబడిన అగ్రికల్చరల్, ఆటోమోటివ్ విభాగాలలో మినీ ప్రాజెక్టులు ప్రదర్శించి విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మచిలీపట్నంలో ఈనెల 7న నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరచి ప్రసంసా పత్రా లు అందు కున్నారు. శనివారం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రధానో పాధ్యాయుడు ప్రసాద్, ఫస్ట్ అసిస్టెంట్ సీహెచ్ రవికుమార్, స్టాఫ్ సెక్రటరీ ఎంఎం హుస్సేన్ ఒకేషనల్ ఇనస్ట్రక్టర్లు కె.ఈశ్వరిహిత, సిహెచ్ వెంకన్నబాబు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలి

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ బృందం పర్యటించింది. మధ్యాహ్న భోజన నాణ్యత విషయంలో పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ అక్షయపాత్ర ద్వారా సరఫరా అయ్యే భోజనాన్ని ప్రభుత్వం పరిశీలించాలన్నారు. పాఠశాలలోని ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదని, విద్యార్థులకు తాగునీటి సమస్య ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థుల సమస్యలను తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని సమరం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నాగేంద్ర పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు సన్ ఫ్లవర్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జోసెఫ్, పీఈటీ

కూచిపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కోసూరు సన్‌ఫ్లవర్ విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ రాజశేఖర్ తెలిపారు. అండర్-17 విభాగంలో మానస, రాజశేఖర్ రెడ్డి ఎంపిక కాగా, ఈ నెల 22న కర్నూలు జిల్లాలో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ జోసెఫ్, పాఠశాల కరస్పాండెంట్ పున్నం రాజు అభినందనలు తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

గుడ్లవల్లేరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి పడి భజన నిర్వహించారు. స్థానిక సంతబజార్ రామాలయం వద్ద చిలంకుర్తి అశ్విని స్వామి, చిలంకుర్తి వెంకటేష్ స్వామి, చిలంకుర్తి సాయి బోధన్(కన్నె స్వామి)లచే ఈ పడి భజన ఏర్పాటుచేశారు. అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములు, భవానీ మాలధారు లు, భక్తులు పెద్ద సంఖ్యలో ఈ పడిభజనలో పాల్గొన్నారు. తొలుత విఘ్నేశ్వర, కుమారస్వామి, అయ్యప్పల పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పడికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములు భజన చేసి గీతాలు ఆలపించారు.

దుప్పట్ల పంపిణీ

గుడివాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గుడివాడకు చెందిన కుంభంపాండు రంగారావు జన్మదినం సందర్భంగా ఆయన కుటుంబసభ్యు ల సహకారంతో శనివారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసి, భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రావ కృష్ణ(ఆర్.కె), నాయకులు కుంభం అయ్యప్ప, లంకా రాంబాబు, గాదె చరణ్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపుల పాడు శ్రీభ్రమ రాంబ సమేత శ్రీశైల బ్రహ్మసూత్ర మరకత మల్లికార్జున స్వామి దేవ స్థానంలో శనివారం వైభవంగా ప్రథమ వార్షిక బ్రహ్మో త్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వ తేదీ వరకు దేవస్థా నం లో వార్షిక బ్రహ్మోత్సవాలతో పాటు నూతన నవ గ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితులు కోసూరి మురళీ కృష్ణ మాచార్యులు, బుచ్చి రామశర్మ పూజలు నిర్వహించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

15న పైడమ్మ ఆలయ ఆవరణలో వేలం

పెడన, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు డిసెంబరు 4 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న సందర్భంగా వివిధ రకాల రుసుములు వసూలు చేసుకునే హక్కు పొందేందుకు ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో జీ.వీ.కృష్ణారావు తెలిపారు. జాతర దినాల్లో ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో ఏర్పాటయ్యే దుకాణాల నుంచి, శిడిబండ్లు, బోనాలు, మేకపోతులు, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పినందుకు యాత్రికుల నుంచి రుసుము వసూలు చేసుకునే హక్కు, ఆలయ ఆవరణలో అమ్మవారి లడ్డూ ప్రసాదం విక్రయించుకునే హక్కు, అమ్మవారికి సమర్పించే చీరలు, రవికలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కు పొందేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. వేలానికి ముందు డిపాజిట్ చెల్లించిన వారు మాత్రమే పాటలో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు.

దాళ్వా సాగుకు అనుమతి ఇప్పించండి



ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ ఇస్తున్న రైతు సంఘం నాయకులు

బంటుమిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాలవ పరిధిలో దాళ్వా సాగుకు ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలంటూ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు రైతు సంఘం నాయకులు శనివారం వినతి పత్రం అందించారు. తీర ప్రాంతమైన బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో ఐదేళ్ల నుంచి దాళ్వా సాగుకు అనుమతులు లేకపోవడంతో ఉప్పు శాతం పెరిగిపోయిందని ఎమ్మెల్యేకు వారు వివరించారు. దీని వల్ల పంట దిగుబడులు రావడం లేదని, కొబ్బరిచెట్లకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వివరించారు. ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు సాగు చేసినా ఆశించిన ఫలితాలు రావడం లేదని, రైతులు నష్టాల బారిన పడుతున్నారని తెలిపారు. ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు, సుజ్ఞానం జనార్దనరావు, అజయ్‌ఘోష్, కేదారనాథ్ పాల్గొన్నారు.

పంట కాలువలో గల్లంతయిన
అయ్యప్ప భక్తుడి మృతదేహం లభ్యం

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బందరు మండలం చినయాదర గ్రామంలోని పంట కాలువలో గల్లంతయిన అయ్యప్ప భక్తుడు శనివారం శవమై కనిపించాడు. శుక్రవారం స్నానానికి వెళ్లిన రాసంశెట్టి సుధాకర్ గల్లంతయిన సంగతి తెలిసిందే. అయ్యప్ప పూజ అనంతరం సుధాకర్ పంట కాలువలో స్నానానికి వెళ్లాడు. దుస్తులు గట్టు మీద కనిపించడంతో అనుమానం వచ్చిన అయ్యప్ప భక్తులు కుటుంబ సభ్యులకు తెలిపారు. గ్రామపెద్దలు, పోలీసులు మృతదేహం కోసం ముమ్మరంగా గాలించారు. చినయాదర గ్రామానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త వాడపాలెం 9/8 కాలువ వద్ద రెస్క్యూ టీమ్ సిబ్బంది మృతదేహాన్ని గుర్తించారు. సుధాకర్ మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. రూరల్ ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూలి పనులకు వెళ్లిన యువకుడు
విద్యుదాఘాతంతో మృతి

కోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలి పనులకు చిత్తూరు జిల్లాకు వెళ్లి అక్కడ విద్యుదాఘాతం కారణంగా మండలంలోని గొల్లపాలెం గ్రామానికి చెందిన యువకుడు దుర్మరణం చెందాడు. గొల్లపాలేనికి చెందిన ఓలేటి ఇంద్రబాబు(27) ఇతర వ్యవసాయ కార్మికులతో కలిసి ఇటీవల చిత్తూరు జిల్లా రేణిగుంటకు వ్యవసాయ పనులకు వెళ్లాడు. శుక్రవారం వ్యవసాయ పనులు చేస్తున్నప్పుడు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నాగాయలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వక్కపట్లవారిపాలెం శివారు బ్రహ్మానందపురంలో శనివారం కొందరు పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై కె.రాజేష్ తన సిబ్బందితో శిబిరంపై దాడి చేసి, ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1340 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏటిమొగలో పది మంది..

ఏటిమొగ గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై రాజేష్, సిబ్బంది దాడి చేశారు. పది మందిని అరెస్టు చేసి రూ. 2400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఘనంగా గౌడ కార్తీక వనసమారాధన



వనసమారాధన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గౌడ, శెట్టి బలిజ, ఈడిగ యూత్ ఆధ్వర్యంలో శనివారం హర్ష కాలేజీ ఆవరణలో కార్తీక వనసమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్తీక దామోదర పూజను సింహాద్రి దొంతులరావు, వరలక్ష్మి, నారగాని నాగశివరామకృష్ణప్రసాద్, వెంకటపద్మావతి దంపతులు నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బోలెం హరిబాబు, కుక్కల సత్యనారాయణ, గున్నం నాగబాబు, సింహాద్రి రాంబాబు, కామన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌గేమ్స్ రాష్ట్ర పోటీలకు మోపిదేవి విద్యార్థులు



ఎంపికయిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మోపిదేవి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్, బేస్‌బాల్ పోటీలకు మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.జయంతి తెలిపారు. బేస్‌బాల్ జూనియర్స్ విభాగంలో పాఠశాలకు చెందిన కొక్కిలిగడ్డ తేజశ్రీ, సీనియర్స్ విభాగంలో పెదపూడి ఫ్రైజీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎన్.దుర్గ ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కబడ్డీ రాష్ట్ర పోటీలకు వరుణ్‌తేజ



వరుణ్‌తేజతో హెచ్‌ఎం సత్యనారాయణ, పీడీ మారుతి

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ జిల్లా ఎంపికల్లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.వరుణ్ తేజ అండర్-14 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అలపర్తి సత్యనారాయణ తెలిపారు. వరుణ్ తేజ్‌ను ఎస్ఎంసీ చైర్మన్ వక్కలగడ్డ లీలా మారుతి, పీడీ గాజుల లక్ష్మీప్రసాద్, కె.శివాజీ అభినందించారు.

వాలీబాల్ రాష్ట్ర పోటీలకు ముంజులూరు విద్యార్థి



గోపు అఖిల్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బంటుమిల్లి: వాలీబాల్ అండర్-14 విభాగంలో ముంజులూరు జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థి గోపు అఖిల్‌కుమార్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు పి.విజయకుమారి తెలిపారు. పీడీ కవితను, అఖిల్ కుమార్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఎంఈవో-2 వెంకటేశ్వరరావు నగదు బహుమతి అందించారు.

సత్యసాయి అఖండ భజన ప్రారంభం

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం ఈడేపల్లి సత్యసాయిబాబా మందిరంలో శనివారం సత్యసాయి అఖండ భజన ప్రారంభించారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాల జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, కన్వీనర్ పోతుకూచి అంజనేయకుమార్, వై.సాయిబాబు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు.

రైతులకు న్యాయం చేసేందుకు కృషి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ



చల్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయం చేసేందుకు అహర్నిశలూ కృషిచేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం చల్లపల్లి సొసైటీ కార్యాలయ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మొంథా తుఫాను ప్రభావానికి పడిపోయిన పొలాల్లోనే కాకుండా, నిలబడి ఉన్న చేలలోనూ దిగుబడి తగ్గుతుందని తాను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు. వారిద్దరూ పంటనష్టం అంచనాల్లో రైతులకు వెసులుబాటు కల్పించి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రైతులకు వీలైనంత మేరకు, ప్రభుత్వం ద్వారా చేయగలిగిన సహాయం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరువోలు బుచ్చిరాజు, నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు మోర్ల రాంబాబు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సొసైటీ చైర్మన్ బొందలపాటి వీరబాబు, ఏవో కె.మురళీకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ తుమ్మల చౌదరిబాబు, సీఈవో తోట కృష్ణారావు పాల్గొన్నారు.

కోదండ రామాలయం పునర్నిర్మాణానికి భూమిపూజ

ఘంటసాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పూషడం గ్రామంలో రూ.40 లక్షలతో పునర్నిర్మించనున్న కోదండ రామాలయానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ భూమిపూజ చేశారు. తుమ్మల నందేశ్వరరావు- సత్యవాణి, బీమా వెంకటేశ్వరరావు - రాజ్యలక్ష్మి దంపతులతో పండితులు పూజలు నిర్వహించారు. నియోజకవర్గ నాయకుడు మండలి వెంకట్రామ్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, డీసీ వైస్ చైర్మన్ పరిశె చలపతి, సర్పంచ్ అంకం మారుతీరావు, ఈమన బాలయ్య, అంకం రాంబాబు, కఠారి ఆది, జ్వాలయ్య పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..

● ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు సవాల్

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ధైర్యం ఉంటే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు సవాల్ విసిరారు. ఎదురుమొండి వారధి నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడానికి సింహాద్రి రమేశ్‌బాబు అరాచకమే కారణమంటూ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేసిన వ్యాఖ్యలపై శనివారం ఆయన స్పందించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు చీకటి రాజకీయాలు చేసి దోచుకోవడం వెన్నతో పెట్టిన విద్య అని, తాము వైసీపీ హయాంలో ఎదురుమొండి వారధి నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిస్తే ఇప్పుడు ఆ నిధులతోనే మరోసారి టీడీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచిందన్నారు. కానీ మండలి బుద్ధప్రసాద్ ఆ నిధులను దారి మళ్లించినట్లుగా అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మండలి బుద్ధప్రసాద్ ప్రజలకు చెప్పేది ఒకటి, చేసేది మరొకటని, గతంలోనూ పులిగడ్డ - పెనుమూడి వారధి కోసం ఎలాంటి కృషి చేయకుండా చివరిలో వారధి నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులిస్తుందన్న తరుణంలో ఉద్యమంలో చొరబడి వారధికి తన తండ్రి పేరు పెట్టుకున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో గతంలో ఎంతో మంది ఎమ్మెల్యేల హయాంలో అభివృద్ధి జరిగితే వారు చేసిన అభివృద్ధిని కూడా మండలి తన ఖాతాలో వేసుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. వైసీపీ హయాంలో ఎదురుమొండి వారధికి టెండర్లు పిలిచిన పత్రికా ప్రకటనను, ప్రభుత్వ జీవోను సింహాద్రి రమేశ్‌బాబు చూపించారు.

12న అవనిగడ్డలో వైసీపీ నిరసన

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అవనిగడ్డలో ఈ నెల 12వ తేదీన నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం అవనిగడ్డలో కార్యక్రమ వాల్ పోస్టర్లను వైసీపీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.



అవనిగడ్డ నుంచి మోపిదేవికి పాలకావడి యాత్ర చేస్తున్న అయ్యప్ప మాలధారులతో కలిసి కావడి మోస్తున్న మండలి వెంకట్రామ్

భక్తిశ్రద్ధలతో పాలకావడి యాత్ర

అవనిగడ్డ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన సీనియర్ గురుస్వామి పూషడపు శ్రీనివాసరావు నేతృత్వంలో శనివారం అవనిగడ్డ నుంచి మోపిదేవి వరకు అయ్యప్ప మాలధారులు పాలకావడి యాత్రను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ యాత్రలో పాల్గొన్నారు. అవనిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం వద్ద యాత్రకు మండలి వెంకట్రామ్, టీడీపీ నేత యాసం చిట్టిబాబు స్వాగతం పలికారు.

చేనేత కుటుంబాలకు నిత్యావసరాలు అందజేత

ఘంటసాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా పని దినాలు కోల్పోయిన 287 మంది చేనేత కార్మికులకు ప్రభుత్వ సాయాన్ని శనివారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పంపిణీ చేశారు. ఒక్కొక్క కార్మికునికి 50 కిలోల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, లీటర్ పామాయిల్ ప్యాకెట్‌తో కూడిన కిట్‌ను అందించారు. తహసీల్దార్ బి.విజయప్రసాద్, తుమ్మల చౌదరిబాబు, అయినపూడి భానుప్రకాష్, గొర్రెపాటి వెంకట రామకృష్ణ, బండి పరాత్పరరావు, ఆర్ఐ శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

సైకత శివలింగానికి పూజలు

నాగాయలంక, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద తగ్గడంతో రేవు మధ్యలో ఉన్న నవలంకలో ఇసుక దిబ్బలు బయటపడ్డాయి. రెండు రోజుల నుంచి నాగాయలంక ఘాట్ నుంచి నవలంకకు ప్రత్యేక పడవలలో సందర్శకులు వెళుతున్నారు. కార్తీక మాసం సందర్భంగా శనివారం భక్తులు కొందరు నవలంకలో సైకత శివలింగాన్ని చేసి కార్తీక దీపాలు పెట్టి పూజలు చేశారు.



నవలంకలో సైకత శివలింగం వద్ద భక్తులు వెలిగించిన దీపాలు

భక్త కనకదాసుకు ఘన నివాళి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మికవేత్త భక్త కనకదాసుకు జయంతిని శనివారం కలెక్టరేట్‌లో అధికారులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి డీఆర్వో కె.చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జి.రమేష్, మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, వ్యవసాయ శాఖ ఏడీ మణిధర్ తదితరులు నివాళులర్పించారు.

భక్తిగీతాల పోటీలకు స్పందన

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన భక్తిగీతాల పోటీలకు విశేష స్పందన లభించింది. 75 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పాలక మండలి అధ్యక్షురాలు దేసు జయప్రద, ఈవో సమ్మెట ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు సంగీత విద్వాంసుడు వడ్లమన్నాటి మహేష్ న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విజేతలకు గాయకుడు మహేష్, ఆలయ ఉద్యోగి మురళి బహుమతులు అందించారు.

స్నానాల ఘాట్‌ను
అభివృద్ధి చేయడం అభినందనీయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : బైపాస్‌రోడ్డు హిందూ శ్మశానవాటికలోని స్నానాల ఘాట్‌ను లంకిశెట్టి ఫ్రెండ్ సర్కిల్ ఉపాధ్యక్షుడు లంకిశెట్టి సాయిబాబు రూ.72 వేలతో అభివృద్ధి చేయడం అభినందనీయమని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. శనివారం లంకిశెట్టి సాయిబాబును బాబాప్రసాద్ తదితరులు సత్కరించారు. మంత్రి కొల్లు రవీంద్ర సహకారంతో కోటి రూపాయలతో శ్మశానాన్ని అభివృద్ధి పరుస్తున్నామని బాబాప్రసాద్ తెలిపారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, సూదాబత్తుల ప్రసాద్, లంకిశెట్టి హరినాథబాబు, గరికపర్తి లీలాప్రసాద్, మాదిరెడ్డి బాబా, పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు దుస్తుల పంపిణీ

చల్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని రేపల్లె ఆటో పాయింట్ ఆటో కార్మికులు 50 మందికి గ్రేస్ వైద్యశాల యాజమాన్యం అందించిన దుస్తులను ఆస్పత్రి ప్రతినిధులు పసుపులేటి కృష్ణ, పసుపులేటి శ్రీనివాసరావు, పసుపులేటి మహేష్ అందించారు. యూనియన్ నేతలు వెనిగళ్ల వసంతరావు, మహమ్మద్ కరీముల్లా, రావుల దావీద్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి
బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న టీడీపీ నాయకులు

మోపిదేవి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదవశాత్తూ మృతిచెందిన పెదప్రోలుకు చెందిన టీడీపీ కార్యకర్త ఘంటా వెంకటలక్ష్మి కుటుంబానికి రూ.5 లక్షల బీమా చెక్కును శనివారం దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు అందజేశారు. పీఏసీఎస్ చైర్మన్ నాదెళ్ల శరత్ చంద్రప్రసాద్, బళ్లా సీతారామప్రసాద్, పార్టీ గ్రామ అధ్యక్షుడు నాదెళ్ల రాజేష్, జన్ను వెంకటేశ్వరరావు, మీసాల శివరామప్రసాద్, కోట సాయి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కోడూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వతంత్రపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ మండల శ్రేణులు చేయూతనందించారు. కోడూరు సుబ్బారావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం టీడీపీ మండల శ్రేణులు సుబ్బారావు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.10 వేలు అందించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బొలిశెట్టి విఠల్‌రావు, వేములపల్లి రాజేష్, అప్పికట్ల రవీంద్రబాబు, గోగినేని సోమశేఖరరావు, పూతబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహిళలు
స్వయం సమృద్ధి సాధించాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సమృద్ధి సాధించాలని తెలుగురైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ సూచించారు. బందరు మండలం కానూరు గ్రామంలో మహిళలు-స్వయం సమృద్ధి అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు పంపితే వెంటనే రైతుల అకౌంట్లలో నగదు జమ అవుతుందని తెలిపారు.

పేద బ్రాహ్మణుల
ఆర్థికాభివృద్ధికి కృషి చేయండి

● బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్‌తో మంత్రి కొల్లు రవీంద్ర



బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ మెడలో ఐడెంటిటీ కార్డు వేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బ్రాహ్మణుల వ్యాపారాలు, చదువులకు రుణ సౌకర్యం కల్పించేందుకు కృషి చేయాలని, వారి ఆర్థికాభివృద్ధి కోసం పనిచేయాలని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పీవీ ఫణికుమార్‌కు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గొల్లపూడిలో పీవీ ఫణికుమార్ శనివారం ప్రమాణస్వీకారం చేశాక మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఐడెంటిటీ కార్డును ఫణికుమార్‌కు మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఈ పదవిని బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. పి.వి. ఫణికుమార్‌ను ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అభినందించారు. పి.వి.ఫణికుమార్ గొల్లపూడిలోని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్ కె.బుచ్చిరామప్రసాద్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు.

టీడీపీ నేత నత్తా సమర్పణ రాజాకు నివాళి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడు నత్తా సమర్పణరాజా 14వ డివిజన్‌లో చేసిన సేవలు మరువలేనివని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సమర్పణరాజా మృతిచెందడంతో ఆయన భౌతికకాయాన్ని శనివారం మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ల బుల్లయ్య సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటస్వామి, అడపా రత్నాకర్, అజయ్, చిట్టినాయుడు, వంకా వెంకటేశ్వరరావు, సాగర్, పాండురంగారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత

వైద్యుల సూచనతోనే ఎక్స్‌రేలు తీయించుకోవాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యుల సూచనల మేరకే స్కానింగ్ మిషన్ల ద్వారా ఎక్స్‌రేలు, స్కానింగ్‌లు తీయించుకోవాలని, రేడియేషన్ కారణంగా ఎంత ప్రయోజనం ఉందో అన్ని ప్రమాదాలు, నష్టాలు ఉంటాయని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.ఆశాలత అన్నారు. అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం సందర్భంగా శనివారం ఆస్పత్రి సమావేశపు హాలులో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తొలుత శాస్త్రవేత్త విలియం రాంటీజన్ చిత్రపటానికి ఆశాలత, ఆర్ఎంవో నిరంజన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, రేడియాలజీ సేఫ్టీ ఆఫీసర్ కొరెడ్ల అంజనీకుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.